www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల : 5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
☏ : 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 76 | బుధవారం | 28 ఆగస్టు 2024

## కర్ణాటకలో మరొకసారి
# కుర్చీలాట
### సిద్దరామయ్యను దించే ఎత్తులు
7 లో..
అస్థిరపరిచే కుట్రలో బీజేపీ.. చాపకింద నీరులా యత్నాలు



## కాళేశ్వరం అవినీతిపై
# కొనసాగుతున్న విచారణ
- రాష్ట్ర కింద పలు సమస్యల వల్లనే కుంగుబాటు
- పొంతనలేని సమాధానాలపై కమిషన్ ఆగ్రహం

3 లో..



## సెప్టెంబర్ 17 నుంచి
# ప్రజాపాలన
- హెల్త్, రేషన్ కార్డుల కోసం వివరాల సేకరణ
- ప్రజల హెల్త్ ప్రొఫైల్ తయారీకి నిర్ణయం
- గోషామహల్‌లో కొత్తగా ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం
- సీజనల్ వ్యాధుల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి
- అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించిన సర్కార్.. ఇప్పుడు మరో దరఫా ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధమైంది. రేషన్ కార్డు, హెల్త్ కార్డుల కోసం వివరాలు సేకరించనుంది. పూర్తి హెల్త్ ప్రొఫైల్‌తో రాష్ట్రంలో ప్రతి పౌరుడికి హెల్త్ కార్డు మంజూరు చేయాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో అధికారులను సన్నద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం నాడు స్పీడ్ (స్మార్ట్ ప్రోయాక్టీవ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ)పై అధికారులతో సీఎం సమావేశమయ్యారు. ఈ భేటీలో అధికారులకు సీఎం కీలక సూచనలు, సలహాలు ఇచ్చారు. సెప్టెంబర్ 17వ తేదీ నుంచి పది రోజుల పాటు మరోసారి ప్రజాపాలన కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇకపై రేషన్ కార్డులు, హెల్త్ కార్డులకు లింక్ ఉండదని, వేర్వేరుగా కార్డులు జారీ చేస్తామని సీఎం చెప్పారు. ప్రజా పాలనలో ప్రతి కుటుంబం నుంచి అందుకు అవసరమైన వివరాలను సేకరిస్తామన్నారు. రాష్ట్రమంతటా అన్ని గ్రామాలు, వార్డుల్లో ప్రజా పాలన కార్యక్రమానికి నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చొంగ్తూ, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి ఈ సమావేశంలో పాల్గొన్నారు. హెల్త్ డిజిటల్ కార్డుల జారీకి ఎలాంటి పద్ధతి అనుసరించాలి. ప్రతి ఒక్కరి మిగతా 2 లో



మద్యం కుంభకోణం కేసులో నిందితురాలిగా ఉన్న ఎమ్మెల్సీ కవితకు ఎట్టకేలకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో గత ఐదు నెలలుగా తీహార్ జైలులో ఉన్న ఆమె విడుదల కానున్నారు. ఈ మేరకు సుప్రీం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు ఇచ్చింది.ఆమె దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. కవిత తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, ఈడీ తరఫున ఏఎస్‌జీ వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం కవితకు బెయిల్ మంజూరు చేసింది.

## ఎమ్మెల్సీ కవితకు
# బెయిల్
### ఈడీ, సీబీఐ కేసుల్లో బెయిల్ మంజూరు
### దర్యాప్తు పూర్తి కావడంతో బెయిల్‌కు అర్హురాలు
### సుప్రీం ద్విసభ్య ధర్మాసనం వెల్లడి

**రాత్రి తీహార్ నుంచి**
**కవిత విడుదల**
**నేడు హైదరాబాద్‌కు రానున్నట్లు సమాచారం**

హైదరాబాద్ : ఢిల్లీ లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు కావడంతో ఆమె బుధవారం హైదరాబాద్‌కు రానున్నారు. ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ ఆమెకు బెయిల్ లభించింది. బెయిల్ కోసం రూ. 10 లక్షల పూచీకత్తు సమర్పించాలని సూచించింది. మంగళ వారం రాత్రి కవిత తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు.

**న్యూఢిల్లీ:**

ఈడీ, సీబీఐ కేసుల్లో కవితకు బెయిల్ ఇస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. బెయిల్ మంజూరుకు సుప్రీంకోర్టు మూడు ప్రధానమైన కారణాలు చెప్పింది. సీబీఐ తుది ఛార్జిషీట్ దాఖలు చేసిందని.. ఈడీ కూడా దర్యాప్తు పూర్తిచేసిందని పేర్కొంది. దీంతో ఇక నిందితురాలు జైలులో ఉండాల్సిన అవసరం లేదంది. మహిళగా కూడా పరిగణిం చాల్సి ఉందని అభిప్రాయపడిరది. అందుకే బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ధర్మాసనం వెల్లడించింది. కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీ)ఈ ఏడాది మార్చి 15న అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద అరెస్ట్ చేసినట్లు ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ జోగేందర్ అప్పట్లో ప్రకటించారు. అరెస్ట్ వారెంట్‌తో ఆమె ఇంటికి వెళ్లిన ఈడీ అధికారులు తొలుత సోదాలు నిర్వహించి, మనీ లాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం విచారించి కవిత వాంగ్మూలం నమోదు చేశారు. మిగతా 2 లో




## ఎంప్లాయ్ ఆఫ్ ది మంత్'
# భద్రత అవార్డులు
- 11 మంది రైల్వే ఉద్యోగులకు ప్రదానం
- దక్షిణ మధ్య రైల్వే జిఎం అరుణ్ కుమార్ జైన్ అందచేత
- జోన్‌లో రైలు కార్యకలాపాల భద్రత నిర్వహణపై సమీక్ష

2 లో..



## 12 రాజ్యసభ స్థానాలకు ఏకగ్రీవం
రాజ్యసభలో మెజార్టీ మార్క్ చేరిన బీజేపీ
2 లో..



## ఆదిలాబాద్ జిల్లాలో
# విషాదం
పొచ్చెర వాగులో ముగ్గురు గల్లంతు
2 లో..





3 లో..

## అందరికీ రుణమాఫీ జరిగి తీరుతుంది
రైతులకు మరోమారు భరోసా ఇచ్చిన మంత్రి తుమ్మల

## ఓవైసీ బ్రదర్స్‌కు బెదరవద్దు
- అక్రమాల కూల్చివేత కొనసాగించాలి
- రేవంత్‌కు పూర్తి మద్దతు తెలిపిన ఎమ్మెల్యే రాజాసింగ్

2 లో..




## టీచర్లు లేక పాఠశాలలు మూసివేత
- గిరిజన ప్రాంతాల్లో 43 స్కూళ్ల మూత
- సిగ్గు చేటని వ్యాఖ్యానించిన హరీష్ రావు

3 లో..



## యాదాద్రీశుడి సేవలో గవర్నర్ జిష్ణుదేవ్
ఘనంగా స్వాగతించిన ఆలయ అధికారులు
7 లో..





# సెప్టెంబర్ 17 నుంచి ప్రజాపాలన

(మొదటిపేజీ తరువాయి)

హెల్త్ ప్రొఫైల్ను నమోదు చేసేందుకు ఏయే వైద్య పరీక్షలు చేయాలి.. గ్రామాల్లోనే హెల్త్ చెకప్ శిబిరాలు ఏర్పాటు చేయాలా... రాష్ట్రంలో ఉన్న లాబోరేటరీల సాయం తీసుకోవాలా...? వెంటనే పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. హెల్త్ డిజిటల్ కార్డుకు సంబంధించి ఫ్రాన్స్‌లో ఉత్తమమైన విధానం అనుసరిస్తున్నారని ఇటీవల విదేశీ పర్యటనలో తనను కలిసిన ప్రతినిధులు చెప్పారని, అక్కడ అనుసరించే విధానాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్య సేవలకు, సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించేందుకు ఇకపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే హెల్త్ కార్డు ప్రామాణికంగా ఉంటుందని సీఎం అన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డెంగ్యూ, చికున్ గున్యా, వైరల్ జ్వరాలతో వివిధ ఆసుపత్రుల్లో పెరుగుతున్న కేసులపై ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాధులు రాకముందే తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్తో పాటు రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో దోమల నిర్మూలనకు ఫాగింగ్, స్ప్రే ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని, ఎప్పటికప్పుడు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీలు చేయాలని సీఎం ఆదేశించారు. పని చేయని ఉద్యోగులను, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేపట్టే చర్యల పట్ల ఉదాసీనంగా వ్యవహరించే వారిని సస్పెండ్ చేయాలని సీఎం హెచ్చరించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ సమన్వయంతో పని చేయాలని సీఎం ఆదేశించారు. అవసరమైతే పోలీసు విభాగం, స్వచ్ఛంద సంస్థలు, మీడియా సహకారంతో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్ని జిల్లాల్లోనూ కలెక్టర్లు, పంచాయతీరాజ్ అధికారులు సీజనల్ వ్యాధులపై వెంటనే ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. అన్ని జిల్లాల్లో కలెక్టర్లు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని, పలు గ్రామాలు, పట్టణాలకు వెళ్లి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. డెంగ్యూ, చికున్ గున్యా కేసులు నమోదైన ప్రాంతాలకు వెళ్లి కారణాలను గుర్తించాలని, అవసరమైన పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే, హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్‌కు తరలించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఇందుకు సంబంధించి భూ బదలాయింపు కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఆస్పత్రి నిర్మాణానికి ఆర్కిటెక్ట్‌తో డిజైన్లు రూపొందించాలన్నారు. వచ్చే 50 ఏళ్లను దృష్టిలో ఉంచుకుని ఆస్పత్రిని నిర్మించాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా డిజైన్లు ఉండాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా రోడ్ కనెక్టివిటీ ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.



# ఎంప్లాయ్ ఆఫ్ ది మంత్' భద్రత అవార్డులు

- 11 మంది రైల్వే ఉద్యోగులకు ప్రదానం
- దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ అందచేత
- జోన్‌లో రైలు కార్యకలాపాల భద్రతనిర్వహణపై సమీక్ష

**హైదరాబాద్, ప్రజానావ:** దక్షిణ మధ్య రైల్వేలోని వివిధ డివిజన్ లలోని సిబ్బంది తమ విధి నిర్వహణలో చురుకుదనం,అంకితభావాన్ని ప్రదర్శించినందుకుగాను 11మంది ఉద్యోగులకు 'ఎంప్లాయ్ ఆఫ్ ది మంత్' భద్రతా అవార్డులను సికింద్రాబాద్‌లోని రైలు నిలయంలో మంగళవారం అందచేశారు. భద్రతా సమీక్షా సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ వీటిని అందజేశారు. ఈ సమీక్షా సమావేశంలో దక్షిణ మధ్య రైల్వేకు చెందిన వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులు, ఆరు డివిజన్ల సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్కు చెందిన డివిజనల్ రైల్వే మేనేజర్లు (డీఆర్ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. అరుణ్ కుమార్ జైన్ జోన్ పరిధిలోని వివిధ డివిజన్లకు చెందిన 11మంది ఉద్యోగులకు విధి నిర్వహణలో అప్రమత్తతను ప్రదర్శించినందుకు అసురక్షిత పరిస్థితులను నివారించడానికి సకాలంలో చర్యలు చేపట్టినందుకు : సికింద్రాబాద్ డివిజన్ -02 ,హైదరాబాద్ డివిజన్ -01, విజయవాడ డివిజన్ -03, గుంతకల్లు డివిజన్ -04 మరియు గుంటూరు డివిజన్ -01 'ఎంప్లాయ్ ఆఫ్ ద మంత్' భద్రతా అవార్డులను అందజేశారు. ఈ అవార్డు గ్రహీతలలో లోకో పైలట్లు, స్టేషన్ మాస్టర్లు, టెక్నీషియన్లు, పాయింట్స్ మ్యాన్, మరియు ట్రాక్ మెయింటెయినర్లు మొదలైన వివిధ వర్గాలకు చెందిన వారు ఉన్నారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ అవార్డు గ్రహీతలవిధుల నిర్వహణలో వారి చిత్తశుద్ధి మరియు నిబద్ధతకు అభినందించారు. ఈ అవార్డులు భద్రతా విధానాలను అనుసరించడంలో ఇతర ఉద్యోగులను ప్రేరేపిస్తాయని, అలాగే రైళ్లను సురక్షితంగా నడిపేందుకు రైల్వేలకు కుడా ఎంతో సహాయపడతాయని ఆయన పేర్కొన్నారు. ÷-రీ అరుణ్ కుమార్ జైన్ జోన్ లోని రైలు కార్యకలాపాల భద్రతపై వివరణాత్మక సమీక్ష నిర్వహించారు. జోన్ వ్యాప్తంగా చేపడుతున్న వివిధ సేఫ్టీ డ్రైవ్‌ల స్థితిగతులపై ఆయన సమీక్షించి, ఏదేని సూక్ష్మ లోపాలుంటే వీలైనంత త్వరగా సరిదిద్దాలని అధికారులకు సూచించారు. సూపర్‌వైజర్లు , లోకో పైలట్‌లు మరియు అసిస్టెంట్ లోకో పైలట్‌లతో క్రమం తప్పకుండా కౌన్సెలింగ్ సెషన్‌లను నిర్వహించాలని మరియు ఎటువంటి షార్ట్ కట్ పద్ధతులను అవలంబించకూడదని, ఖచ్చితంగా అన్ని సమయాల్లో భద్రతా విధానాలకు అనుగుణంగా ఉండేలా క్షేత్రస్థాయి సిబ్బందికీ ఎప్పటికప్పుడు కౌన్సెలింగ్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. రువాత, ఆర్.ఎల్.డి.ఏ (రైల్ ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ) అధికారులు దక్షిణ మధ్య రైల్వేకి సంబంధించి తాము అమలు చేస్తున్న వివిధ రైలు అభివృద్ధి ప్రాజెక్టుల స్థితిగతులపై వివరణాత్మక ప్రదర్శనను అందించారు. విజయవాడ మరియు గుంటూరుడివిజన్‌ల డివిజనల్ రైల్వే మేనేజర్‌లు తమ జోన్‌లు చేపట్టిన ఆవిష్కరణలు /పనితీరుపై జనరల్ మేనేజర్ కు వివరించారు. వారి పనితీరుపట్టల జనరల్ మేనేజర్ డివిజన్లను అభినందించారు. మరియు అదే కృషిని మునుముందు కొనసాగించాలని సూచించారు

# ఎమ్మెల్సీ కవితకు బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

ఆమె నుంచి ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కవితను తిహార్ జైలుకు తరలించారు. ఢిల్లీ మద్యం విధానంలో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ 2022 ఆగస్టులో సీబీఐ కేసు నమోదు చేసింది. ఇదే కేసులో హైదరాబా ద్‌కు చెందిన మద్యం వ్యాపారి అరుణ్ రామచం ద్రపిల్కై వాంగ్మూలాన్ని సేకరించిన అనంతరం కవితకు నోటీసులు జారీ చేసింది. మరోవైపు ఢిల్లీ మద్యం టెండర్ల వ్యవహారంలో సౌత్ లాబీ తరఫున రూ.కోట్లు చేతులు మారాయనే కోణంలో ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. అరుణ్ రామచంద్రపిల్కై రిమాండ్ నివేదికలో అతడిని కవిత బినావిరీగా పేర్కొంది. ఈ సౌత్ గ్రూప్ ద్వారా రూ.100కోట్ల ముడుపులు ఆప్‌కు హవాలా మార్గంలో అందా యని అభియోగం మోపింది. గతేడాది మార్చిలో కవితకు నోటీస్ జారీ చేసి విచారించింది. ఆ తర్వాత మరోమారు కూడా సమన్లు జారీ చేసింది. అవి మహిళలకు ఉన్న హక్కులను ఉల్లంఘించేలా ఉన్నందున వాటిని కొట్టేయాలని ఆమె గత ఏడాది మార్చి 15న సుప్రీంకోర్టును ఆశ్రయించి అప్పట్లో ఉపశమనం పొందారు. సరిగ్గా ఈ ఏడాది అదే రోజు ఆమెను ఈడీ అరెస్టు చేసింది. ఇదే కేసులో ఆప్ నేత మనీస్ సిసోడియాకూడా ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చారు. దీంతో కవతకు కూడా ఏరట దక్కడం ఖాయమని బిఆర్ఎస్ నేతలు భావిస్తూ వచ్చారు.

## తీహార్ నుంచి కవిత విడుదల

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం మధ్యాహ్నం 2:45 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోనున్నారు. కవిత వెంట ఆమె భర్త అనిల్ కుమార్, కేటీఆర్, హరీష్ రావు రానున్నారు. కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. లిక్కర్ కేసులో దర్యాప్తు పూర్తయ్యిందని.. ఛార్జ్ షీట్ కూడా దాఖల్కైందని ఈ దశలో కవితను జ్యుడీషియల్ కస్టడీలో ఉంచడం సరికాదని అభిప్రాయడిరది. సెక్షన్ 45 ప్రకారం ఒక మహిళ బెయిల్ పొందేందుకు అర్హత ఉందని ధర్మాసనం తెలిపింది. గతంలో ఢల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టిపారేసింది. సెక్షన్ 45 అనేది దుర్బల మహిళలకు మాత్రమే వర్తిస్తుందన్నట్లు హైకోర్టు జడ్జి వ్యవహరించారని పేర్కొంది. సెక్షన్ 45పై కోర్టులు సున్నితంగా వ్యవహరించాలని చెప్పింది. ఒక మహిళ విద్యాధికురాలు అయినంత మాత్రాన ఆమెకు బెయిల్ నిరాకరించడం సరికాదని తెలిపింది. ఈ మేరకు బెయిల్‌ను మంజూరు చేసింది.

# ఓవైసీ బ్రదర్స్‌కు బెదరవద్దు

## అక్రమాల కూల్చవేత కొనసాగించాలి
## రేవంత్‌కు పూర్తి మద్దతు తెలిపిన ఎమ్మెల్యే రాజాసింగ్

**హైదరాబాద్, ప్రజానావ:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మద్దతు తెలిపా రు. చెరువులను కాపాడాలని సీఎం సంకల్పం తీసు కోవటం అభినందనీయమని కొని యాడారు. సీఎం రేవంత్ రెడ్డి సంకల్పం పూర్తి కావాలని కోరుకుం టున్నానని తెలిపారు. ఓవైసీ బ్రదర్స్ బెదిరింపులకు భయపడొద్దని ఎమ్మెల్యే తెలిపారు. వేలమంది యువత మద్దతు ఉందని అక్బరుద్దీన్ బెదిరిస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి మాదిరి భయపడకుండా రేవంత్ రెడ్డి ముందుకెళ్ళాలని సూచించారు. ఓవైసీ బ్రదర్స్‌ను బొక్కలో వేసిన సీఎంగా కిరణ్ కుమార్ రెడ్డికి పేరుందని గుర్తుచేశారు. ఉచిత విద్య పేరుతో ఓవైసీ సోదరులు కోట్లు దోచుకుం టున్నారని ఆరోపించారు. చెరువులో 12ఎకరాలు ఆక్రమించి ఫాతిమా కాలేజ్‌ను నిర్మించారన్నారు. అసదుద్దీన్ ఓవైసీ బంగ్లా కూడా ప్రభుత్వ స్థలంలోనే ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంఐఎంకు గులాంగిరి చేసిందని విమర్శించారు. కలెక్టర్ సాయంతో గోషామహాల్ నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు మాయమవుతున్నాయని రాజాసింగ్ పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తూ హైడ్రా ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయితే హైడ్రాపై మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. బండ్లగూడ లో గల ఫాతిమా ఓవైసీ కాలేజీని హైడ్రా కూల్చివేస్తుందనే వార్తలపై స్పందించారు. చెరువు కబ్జా చేసి ఓవైసీ బ్రదర్స్ స్కూల్ నిర్మించారని హైడ్రాకు ఫిర్యాదులు వచ్చాయి. ఆ క్రమంలో అక్బరుద్దీన్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'కావాలంటే నాపై మళ్లీ బులెట్ల వర్షం కురిపించండి. ఆ స్కూల్ కూల్చకండి. పేదలకు ఉచిత విద్య అందించేందుకు 12 బిల్డింగులు నిర్మించా. వీటిని కావాలని కొందరు తప్పుగా చూపిస్తున్నారు. గతంలో నాపై కాల్పులు జరిగాయి. కావాలంటే మళ్లీ బులెట్ల వర్షం కురిపించండి. కత్తులతో దాడి చేయండి. పేదల విద్యాభివృద్ధి కృషికి అడ్డుపడకండి అని' అక్బరుద్దీన్ సూచించారు. అయితే ఇప్పుడు ఎమ్మెల్యే అక్బరుద్దీన్ వ్యాఖ్యలతో సల్కం చెరువు కబ్జా విషయం హాట్ టాపిక్‌గా మారింది. ఎవరి నోట విన్నా ఇదే చర్చ నడుస్తోంది. రేవంత్ రెడ్డి సర్కార్.. ఓవైసీ బ్రదర్స్‌కు చెందిన విద్యాసంస్థలను కూల్చుతుందా? లేదా? అనేది సస్పెన్స్‌ను తలపిస్తోంది. ఓవైసీ బ్రదర్స్ నిర్మించిన అక్రమ నిర్మాణాలు కూల్చాలంటూ హైడ్రాకు ఫిర్యాదుల విరీద ఫిర్యాదులు అందుతున్నాయి. చెరువును మట్టితో పూడ్చేసి భారీ భవనాల నిర్మాణం గావించారు . 2016 -2021 లో కబ్జాకు గురైనట్టు నిర్ధారణ అయ్యింది.

# 12 రాజ్యసభ స్థానాలకు ఏకగ్రీవం

## రాజ్యసభలో మెజార్టీ మార్క్ చేరిన బీజేపీ

**న్యూఢిల్లీ:** రాజ్యసభ ఉప ఎన్నికల్లో 12 స్థానాలూ ఏకగ్రీవమయ్యాయి. 9 రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న 12 రాజ్యసభ స్థానాల్లో ఉప ఎన్నికల నిర్వహణకు ఇటీవల ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 21వరకు నామినేషన్లు స్వీకరించగా.. తొమ్మిది స్థానాల్లో భాజపా, రెండు స్థానాల్లో ఆ పార్టీ మిత్రపక్షాలైన ఎన్సీపీ, ఆర్ఎల్ఎం అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మ-రోవైపు, తెలంగాణ నుంచి కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాజా పరిణామంతో ఎగువ సభలో ఎన్డీయే మెజార్టీ మార్కును అందుకుంది. తాజా ఎన్నికతో రాజ్యసభలో భాజపా బలం 96కి చేరగా.. మిత్రపక్షాలతో కలిపి ఎన్డీయే ఆ బలం 112గా ఉంది. దీనికితోడు అధికార పార్టీకి ఆరుగురు నామినేటెడ్, ఒక స్వతంత్ర సభ్యుడి మద్దతు కూడా ఉంది. తాజాగా కాంగ్రెస్ నుంచి ఒక సభ్యుడు గెలుపొందడంతో రాజ్యసభలో ప్రతిపక్షాల బలం 85కి పెరిగింది. రాజ్యసభలో ప్రస్తుతం మరో ఎనిమిది స్థానాలు ఖాళీగా ఉన్నాయి. జమ్మూ కశ్మీర్‌లో నాలుగు, మరో నాలుగు నామినేటెడ్ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. దీంతో రాజ్యసభలో ప్రస్తుతం సభ్యుల సంఖ్య 237గా ఉండగా.. ఇందుకు మెజార్టీ మార్కు 119గా ఉంది. కొత్త సభ్యులను కలిపి చూస్తే.. ఎన్డీయేకు రాజ్యసభలో మెజార్టీ ఉంది. కగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థుల్లో ..కిరణ్ చౌధరి (భాజపా, హరియాణా), మమతా మొహంతా (భాజపా, ఒడిశా), మిషన్ రంజన్ దాస్ (భాజపా, అస్సాం), రామేశ్వర్ తేలీ (భాజపా, అస్సాం), ధైర్యశీల్ పాటిల్ (భాజపా, మహారాష్ట్ర), రవనీత్ సింగ్ బిట్టూ (భాజపా, రాజస్థాన్), ఉపేంద్ర కుశ్వాహా (రాష్ట్రీయ లోక్ మోర్చా, బిహార్), నితిన్ పాటిల్ (ఎన్సీపీ-మహారాష్ట్ర-), మనన్ కుమార్ మిశ్ర (భాజపా, బిహార్), జార్జి కురియన్ (భాజపా, మధ్యప్రదేశ్), రాజీబ్ భట్టాచార్య (భాజపా, త్రిపుర), అభిషేక్ మను సింఘ్వీ (కాంగ్రెస్- తెలంగాణ) ఉన్నారు.

# అవును.. బిజెపిలో చేరుతున్నా!

## జార్ఖండ్ మాజీ సిఎం చంపయ్ సోరెన్ వెల్లడి




**రాంచీ:** జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ నాయకుడు చంపాయ్ సోరెన్ సొంత పార్టీ పెడుతారా.. లేదంటే బీజేపీలో చేరుతారా..? అనే సందిగ్ధానికి తెరపడిరది. తాను బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ నెల 30న బీజేపీలో చేరనున్నట్లు తెలిపారు. ఇదే విషయాన్ని జార్ఖండ్ బీజేపీ వ్యవహారాల ఇన్‌చార్జ్, అసోం ముఖ్యమంత్రి హిమాంత బిశ్వశర్మ ముందుగానే ప్రకటించారు. చంపాయ్ సోరెన్ ఇప్పుడు స్వయంగా ధ్రువీకరించారు. ఈ నెల 18న నేను ఢల్లీకి వచ్చినప్పుడే నా స్థానం ఏమిటో స్పష్టం చేశాను. వాస్తవానికి ముందుగా నేను రాజకీయాల నుంచి తప్పుకోవాలని భావించాను. కానీ ప్రజలలో నాకున్న మద్దతు చూసి నిర్ణయం మార్చుకున్నా. బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నా' అని చంపాయ్ సోరెన్ చెప్పారు. ఈ నెల 30న విరీరు బీజేపీలో చేరతారని వార్తలు వినిపిస్తున్నాయి, వాస్తవమేనా అన్న విరీడియా ప్రశ్నకు చంపాయ్ సోరెన్ అవునని సమాధానం ఇచ్చారు. కాగా, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ భూకుంభకోణం కేసులో అరెస్ట్ కావడంతో సీఎం పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో సీనియర్ నాయకుడు చంపాయ్ సోరెన్‌ను సీఎంగా నియమించారు. అయితే గత నెలలో ఆ కేసులో హేమంత్ సోరెన్‌కు బెయిల్ లభించడంతో జైలు నుంచి విడుదలయ్యారు. అనంతరం చంపాయ్ సోరెన్‌తో రాజీనామా చేయించి సీఎం పదవి చేపట్టారు. దాంతో తన నుంచి అవమానకరంగా సీఎం పదవి లాక్కున్నారని చంపాయ్ సోరెన్ మనస్తాపం చెందారు. ఈ నేపథ్యంలో తదనంతర పరిణామాలు చోటుచేసుకున్నాయి.

# బండి సంజయ్‌ది రాజకీయ అజ్ఞానం

## మండిపడ్డ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**హైదరాబాద్, ప్రజానావ:** మద్యం పాలసీలో ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయ కక్ష్యతో దర్యాప్తు సంస్థలు పెట్టిన కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం పట్ల మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఒక ప్రకటనలో హర్షం ప్రకటించారు. ఆధారాల్లేని కేసులో ఐదు నెలలు జైలులో ఉంచడం బాధాకరమని, సుప్రీం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేయడాన్ని రెండు రాజకీయ పార్టీల ఒప్పందంగా పేర్కొనడం కేంద్ర మంత్రి స్థాయిలో ఉన్న బండి సంజయ్ రాజకీయ అజ్ఞానానికి నిదర్శనం అన్నారు. ఈ వ్యాఖ్యలు కోర్టు ధిక్కరణ కిందకే వస్తాయని అన్నారు. కవిత కేసులో న్యాయవాది వృత్తిపరంగా వ్యవహరించారన్న విషయం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు బయటపడి, తెలంగాణ కాంగ్రెస్ నేతలకు దానితో సంబంధం ఉందని తెలుస్తున్నా కోట్ల రూపాయలు అక్రమంగా అనుమానాస్పద ఖాతాల్లోకి మళ్లాయనే ఆరోపణలు వస్తున్నాయి. అయినా ఇప్పటి వరకు ఈడీ చర్యలు తీసుకోక పోవడంతోనే ఏ పార్టీ ఏ పార్టీతో కలిసి పనిచేస్తుందో అర్థమవుతున్నదని విమర్శించారు.



# ఆదిలాబాద్ జిల్లాలో విషాదం

## పొచ్చెర వాగులో ముగ్గురు గల్లంతు

**ఆదిలాబాద్, ప్రజానావ:** ఆదిలాబాద్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పొచ్చుర వాగులో చేపల వేటకు వెళ్లి ముగ్గురు యువకుల గల్లంతవగా ఒకరి మృతదేహం లభ్యమైంది. మిగతా ఇద్దరి కోసం పోలీసులు, స్థానిక జాలరులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన కూలీలు ఆకాష్, అక్షయ్, విజయ్ అనే ముగ్గురు ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం బండల్నాగాపూర్‌లో బంధువుల ఇంట్లో ఉంటున్నారు. మంగళవారం ఆకాష్ , విజయ్ తమ బంధువైన శ్రీనివాస్‌తో కలిసి ఆదిలాబాద్ రూరల్ మండలం పొచ్చుర వాగులో చేపల పట్టడానికి వెళ్లారు. చేపలు పడుతుండగా శ్రీనివాస్ వాగులో పడిపోగా ఆయనను రక్షించేం దుకు ఆకాష్ విజయ్‌లు ప్రయత్నించి వారు సైతం నీటిలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పోలీస్, డీడీఆర్ఎఫ్ బృందాలు స్థానిక జాలర్లతో కలిసి గాలింపు చర్యలు చేపట్టాగా విజయ్ మృతి దేహం లభ్యమైంది. మిగతా ఇద్దరి కోసం వాగులో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.




# రాజముద్రనే మార్చేస్తారా?

**• ఇది అధికారికమా.. అనధికారికమా • వరంగల్ ప్లెక్సీపై కేటీఆర్ ఆగ్రహం**

**హైదరాబాద్, ప్రజానావ:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తెలంగాణ రాజముద్రను మార్చడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. ఇది అధికారిక నిర్ణయమా లేక అనధికార నిర్లక్ష్యమా అని మండిపడ్డారు. అసలు ఏం జరుగుతుందో కనీసం మీకైనా తెలుసా అంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని ప్రశ్నించారు. తెలంగాణ అస్తిత్వ చిహ్నాలైన కాకతీయ తోరణం, చార్మినార్‌లతో ఈ వెకిలి పనులు ఏంటంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. కాకతీయ కళాతోరణం, చార్మినార్ లేని రాజముద్రతో గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఎదుట అధికారులు ఏర్పాటు చేసిన ప్లెక్సీ ఇది.. ఈ కొత్త చిహ్నం ఎవరు, ఎప్పుడు ఆమోదించారంటూ నిలదీశారు. ఒకవేళ ఆమోదించకపోతే అధికారులు ఎందుకు దీన్ని వాడారన్నారు. దీనికి కారకులెవరో కనుక్కుని వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. జముద్రను అధికారులు ఇష్టారీతిగా వినియోగిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని తక్కువ చేసేలా రాజముద్రలో మార్పులు చేసే ప్రతిపాదన ముందుకు తెచ్చింది. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో వెనక్కి తగ్గింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మాత్రం అత్యుత్సాహం చూపి రాజముద్రను మార్చారు. ఎల్ఆర్ఎస్‌పై సందేహాల నివృత్తి కోసం ప్రభుత్వం అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సోమవారం హెల్ప్ డెస్క్ బ్యానర్ ఏర్పాటు చేశారు. ఇందులో తెలంగాణ రాజముద్ర మార్చేశారు. అధికారిక రాజముద్ర కాకుండా కొత్తగా చేసి పెట్టారు. అధికారులు రాజముద్రను మార్చడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం వరంగల్ చారిత్రక గొప్పదనాన్ని తెలిపేలా రాజముద్రలో కాకతీయ కళాతోరణాన్ని పెడితే, మున్సిపల్ కార్పొరేషన్ విరుద్ధంగా వ్యవహరించిందని విమర్శిస్తున్నారు.

వరంగల్ నగర ఔన్నత్యాన్ని తగ్గించేలా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# అందరికీ రుణమాఫీ జరిగి తీరుతుంది

**రైతులకు మరోమారు భరోసా ఇచ్చిన మంత్రి తుమ్మల**



**ఖమ్మం, ప్రజానావ:** రుణమాఫీ కాని రైతులు అధైర్య పడవద్దని, అందరికీ మాఫీ చేసే బాధ్యత ప్రభుత్వానిదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మరోమారు స్పష్టం చేశారు. రైతు రుణమాఫీపై కలెక్టరేట్ వద్ద రైతు సంఘాలు మంగళవారం ధర్నాకు దిగాయి. విషయం తెలిసిన వెంటనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అక్కడకు చేరుకున్నారు. ధర్నా వద్దకు వెళ్లి రైతు సంఘం నేతలకు రైతులకు రుణమాఫీపై స్పష్టతనిచ్చారు. ఆపై రైతులు తమ ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రైతు రుణమాఫీ అవ్వని రైతులు అపోహ పడొద్దన్నారు. కుటుంబ నిర్ధారణ కానీ రైతుల ఇళ్లకు వ్యవసాయ శాఖ సిబ్బంది వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపారు. రైతుల ఇంటి వద్దే కుటుంబ నిర్ధారణ చేసి వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తారన్నారు. బ్యాంకుల్లో మొత్తం 42 లక్షల రైతులు 31 వేల కోట్లు అప్పు ఉన్నారని తెలిపారు. రెండు లక్షల రుణమాఫీ 18 వేల కోట్ల రైతులు ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడించారు. రెండు లక్షల పైన రుణాలు ఉన్న రైతుల రుణమాఫీపై క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామ న్నారు. గత ప్రభుత్వం చేసిన రైతు రుణమాఫీపై కాగ్ నివేదికలో వాస్తవాలు వెల్లడయ్యాయన్నారు. రైతులను గందరగోళం చేసే పనులు చేయొద్దని హితవుపలికారు. సీఎం రేవంత్ రెడ్డి వాగ్దానం చేసినట్లు 31 వేల కోట్లు రుణమాఫీ చేసి తీరుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోసారి స్పష్టం చేశారు.

# కవితకు బెయిల్‌పై బండి విపరీత వ్యాఖ్యలు

**కోర్టు ధిక్కరణగా పరిగణించాలన్న కేటీఆర్**



**హైదరాబాద్, ఆగస్టు 27 :** ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయటంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. సుప్రీంకోర్టుకు ఉద్దేశాలు ఆపాదించేలా కామెంట్స్ చేసిన బండి సంజయ్ తీరును తప్పుబట్టారు. ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలా విజయమంటూ బండి సంజయ్ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ లాయర్ చేసిన కృషితో ఒకరికి బెయిల్ వస్తే బీఆర్ఎస్ సపోర్ట్ కారణంగా ఒకరు రాజ్యసభలో స్థానం పొందారంటూ వివాస్పద వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్సీ కవిత బెయిల్ కోసం తొలుత వాదనలు వినిపించిన లాయర్‌కు కాంగ్రెస్ తరఫున రాజ్యసభ సీటు వచ్చేలా కేసీఆర్ రాజకీయ చతురత ప్రదర్శించారంటూ ఆయన చేసిన ట్వీట్ చేశారు. వైన్ అండ్ డైన్ క్రైమ్ లో పార్టనర్స్ అయిన కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు కంగ్రాట్యులేషన్స్ అంటూ స్థాయిని మరిచి సుప్రీంకోర్టు తీర్పును అపహాస్యం చేసేలా బండి సంజయ్ కామెంట్స్ చేశారు. దీనిపై కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. కేంద్ర హోంశాఖ సహాయశాఖ మంత్రిగా ఉన్న బండి సుప్రీం కోర్టు తీర్పుపై అభ్యంతరం వ్యక్తం చేయడం సరికాదని తెలిపారు. గౌరవప్రదమైన స్థానంలో ఉండి ఇలా స్పందించడమేంటని నిలదీశారు. ఈ వ్యాఖ్యలను కోర్టు ధిక్కారంగా తీసుకుని బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ భవన్ వద్ద సంబురాలు

**• కుట్రపూరితంగా జైలులో పెట్టారన్న నేతలు**
**• సుప్రీంలో న్యాయం దక్కిందని వ్యాఖ్యలు**



**ఖైరతాబాద్, ప్రజానావ:** ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు కావడంతో బీఆర్ఎస్ శ్రేణులు సంతోషంలో మునిగిపోయారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పటాకులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఏ ఆధారాలు చూపకుండా అక్రమంగా 166 రోజులు జైల్లో పెట్టారని.. రాజకీయ ప్రేరేపిత కేసులో చివరకు న్యాయమే గెలిచిం దని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. కాగా, కవితకు బెయిల్ ఇవ్వడం పట్ల సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు న్యాయమే గెలిచిందని ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిన్నామని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. కొంత ఆలస్యమైనా న్యాయమై గెలిచిందని అభిప్రాయపడ్డారు. ఇది రాజకీయ ప్రేరేపిత కేసు అని ఆయన పేర్కొన్నారు. కవిత కడిగిన ముత్యంలా బయటకు వస్తున్నారని అన్నారు. చివరికి న్యాయమే గెలిచింది ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి అన్నారు. కవితకు బెయిల్ రావడం తెలంగాణ ఉద్యమకారులకు ఊపిరినిచ్చిందని మాజీ స్పీకర్, ఎమమెల్సీ మధుసూధనాచారి అన్నారు. కవితకు సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నా మని దేవీ ప్రసాద్ అన్నారు. కవితపై కుట్రపూరితంగా కేసుపెట్టారని ఆయన అన్నారు. తమపై ఆరోపణలు చేసిన వారందరికీ ఈ తీర్పు చెంపపెట్టు అని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పును కాంగ్రెస్ నేతలు తప్పుబడుతున్నారని మండిపడ్డారు. ఈ మేరకు పార్టీ కార్యలయం వద్ద పలువురు సంబరాలు చేసుకునన్నారు. కవిత ఇక తిరిగి తెలంగాణ రాజకీయాల్లో పాల్గొంటారని ప్రకటించారు.

# నర్సింగ్ విద్యార్థినిపై ఆటోడ్రైవర్ అత్యాచారం

**ముంబయి :** కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచారం ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. లైంగిక దాడులను ఆపేందుకు కఠిన చట్టాలు తీసుకురావాలని పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయి. అయినప్పటికీ మహిళలపై అరాచకాలు ఆగట్లేదు. తాజాగా మహారాష్ట్రలో మరో ఘటన చోటుచేసుకుంది. నర్సింగ్ విద్యార్థినిపై ఓ ఆటోడ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని రత్నగిరిలో నర్సింగ్ విద్యార్థిని(20) తరగతులకు హాజరైన అనంతరం ఇంటికి వెళ్లడానికి ఆటో ఎక్కింది. ఆమెతో మాటలు కలిపిన డ్రైవర్ తాగడానికి నీళ్లు ఇచ్చాడు. అప్పటికే అందులో అతడు మత్తుమందు కలపడంతో యువతి స్పృహ కోల్పోయింది. అనంతరం ఆమెను నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లిన డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్రగాయాలతో, అపస్మారకస్థితిలో ఉన్న బాధితురాలిని గమనించిన స్థానికులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. కొంత సేపటికి స్పృహ రావడంతో తనపై లైంగిక దాడి జరిగినట్లుగా గుర్తించిన బాధితురాలు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసింది. వారు పోలీసులను ఆశ్రయించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడిని త్వరగా అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బాధితురాలి బంధువులు, స్థానికులు, డాక్టర్లు, నర్సులు అర్ధరాత్రి రోడ్డుపై పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం ఘటన నేపథ్యంలో దేశవ్యాప్తంగా నిరసనలు చెలరేగుతున్నాయి. పని ప్రదేశాల్లో రక్షణ కల్పించాలని వైద్యులు, నర్సులు ఆందోళన చేపడుతున్నారు. ఈ తరుణంలో మరో విద్యార్థినిపై లైంగిక దాడి జరగడం ఆందోళన కలిగిస్తోంది.

# కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

**హైదరాబాద్, ప్రజానావ:** కుటుంబ తగాదాలు, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఓ వ్యక్తి క్షణికావేశంలో కుటుంబ సభ్యులు చూస్తుండగానే ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మీర్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లెలగూడ లలితానగర్ కాలనీలో నివసించే శీలం సురేష్ (37) అబిడ్స్‌లోని జనరల్ పోస్టాఫీసులో వ్యాన్‌డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం దంపతుల మధ్య ఘర్షణ జరగగా, ఆవేశంలో బెడ్రూమ్‌లోకి వెళ్లిన సురేష్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. కుటుంబ సభ్యులు కాపాడేలోపే మంటల్లో కాలిపోయాడు. గదిలోని ఫర్నిచర్‌కు మంటలు అంటుకొని దట్టమైన పొగ అలుముకుంది. సమాచారమందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలావుండగా వైద్య పరీక్షల నిమిత్తం కూతురిని వెంటబెట్టుకొని బైక్‌పై వెళ్తుండగా టెంపో ట్రావెల్ మినీ బస్సు మృత్యువు రూపంలో దూసుకొచ్చింది. ఈ ఘటనలో కూతురు దుర్మరణం పాలుకాగా, తండ్రికి గాయాల య్యాయి. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగర శివారు చెంగిచెర్లకు చెందిన శంకరరావు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్పీఎఫ్)లో ఎస్ఐ. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొద్దిరోజులుగా తనకు అనారోగ్యంగా ఉండడంతో ఎర్రమంజిల్ ఏఐజీ ఆస్పత్రిలో ఎండోస్కోపీ పరీక్ష కోసం సోమవారం కూతురు ప్రసన్న (25)తో కలిసి బైక్‌పై బయలుదేరాడు. బేగంపేట మెట్రోస్టేషన్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన టెంపో ట్రావెల్ మినీ బస్సు వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు కావడంతో ప్రసన్న అక్కడికక్కడే మృతిచెందగా, శంకర్‌రావుకు గాయాలయ్యాయి. పోలీసులు టెంపో ట్రావెల్స్ డ్రైవర్ సతీశ్‌ను అరెస్టు చేశారు.



# కాళేశ్వరం అవినీతిపై కొనసాగుతున్న విచారణ

**• రాఫ్ట్ కింద పలు సమస్యల వల్లనే కుంగుబాటు**
**• పొంతనలేని సమాధానాలపై కమిషన్ ఆగ్రహం**

**హైదరాబాద్, ప్రజానావ:** కాళేశ్వరం లిఫ్టుల్లో అవినీతి, అక్రమాలు, నాణ్యతా లోపాలపై తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు జస్టిస్ పీసీ చంద్రఘోష్ కమిషన్ విచారణ కొనసాగుతోంది. మేడిగడ్డ ప్రాజెక్టు కుంగు బాటుకు కారణం రాఫ్ట్ కింద పలు సమస్యల వల్ల జరిగింది అన్నట్లు మిషన్ ముందు ఇంజనీర్లు చెప్పారు. సిఖెంట్, అలాట్మెంట్ డివియేషన్ వల్ల సమస్య వచ్చింది అన్నట్లు ఇంజనీర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. డిజైన్ల అప్రూవల్ తర్వాత అన్నారం గ్యారేజీ మోడిఫికేషన్ జరిగిందని కమిషన్ ముందు ఇంజనీర్ ఒప్పుకున్నారు. అయితే రామగుండం ఈసీ లేఖపై మాత్రం కమిషన్ ముందు ఇంజనీర్ దయాకర్ రెడ్డి స్పష్టత లేని సమాధానం చెప్పినట్లు తెలుస్తోంది. హై పవర్ కమిటీలో సీడీఓ అధికారులు సభ్యులుగా ఉన్నారు అని ఇంజనీర్లు ఒప్పుకున్నారు. డిజైన్లు తయారు చేసే ముందు సైట్ విజిట్ ఖచ్చితంగా చేయన క్కర్లేదు అని కమిషన్ ముందు వారు చెప్పారు. అన్నారం సుందిళ్ల బ్యారేజీల లోకేషన్ మారినట్లు కమిషన్‌కు అధికారులు చెప్పారు. అయితే మేడిగడ్డ లోకేషన్ మారలేదని తాజా మాజీ ఇంజనీర్లు.. కమిషన్ ముందు స్పష్టం చేశారు. సీడీఓ - ఎల్అండ్‌టీ వేర-ువేరుగా డిజైన్లు తయారుచేసి అప్రూవల్‌కు అన్ని ఒకే దగ్గర చేసినట్లు ఇంజనీర్లు తెలిపారు. మూడు బ్యారేజీలకు సంబంధించి డిజైన్లలో ఎలాంటి సమస్య లేదని నిబంధనల ప్రకారమే డిజైన్లు ఉన్నాయని ఇంజనీర్లు వెల్లడించారు. ఇలా పొంతనలేని సమాధానాలపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంజనీర్లపై జస్టిస్ పీసీ చంద్ర ఘోష్ కమిషన్ సీరియస్ అయ్యింది. పొంతన లేని సమాధానాలు చెప్పడంపై ఇంజనీర్ల తీరును తప్పుబట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఓపెన్ కోర్టులో భాగంగా మంగళవారం విచారణకు ఐదుగురు తాజా, మాజీ అఅక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు హాజరయ్యారు. విచారణలో భాగంగా అప్రూవల్ పొందిన తర్వాత బ్యారేజీల డిజైన్లలో మార్పులు చేర్పులు ఏమైనా జరిగాయా అని కమిషన్ ప్రశ్నించింది. డిజైన్లు అప్రూవల్ చేసే ముందు ఆ తర్వాత అన్ని నిబంధనలు పాటించారా అని ప్రశ్నించారు పీసీ ఘోష్. హై పవర్ కమిటీ నిబంధనలు క్రైటీరియా ఫాలో అయ్యారా లేదా అని ఇంజనీర్లను ప్రశ్నించారు. డిజైన్స్ అప్రూవల్ అయిన తర్వాత లోకేషన్‌లలో ఏమైనా మార్పులు చేర్పులు చేశారని ప్రశ్నించారు. అన్నారం సుందిళ్ల బ్యారేజీల లోకేషన్ మారినట్లు కమిషన్ కు చెప్పారు అధికారులు. మేడిగడ్డ లోకేషన్ మారలేదని కమిషన్ ముందు స్పష్టం చేశారు తాజా మాజీ ఇంజనీర్లు. సిడిఓ - ఎల్ అండ్ టి వేరువేరుగా డిజైన్లు తయారుచేసి ఫైనల్ అప్రూవల్ కు అన్ని ఒకే దగ్గర చేసినట్లు తెలిపారు. మూడు బ్యారేజీలకు సంబంధించి డిజైన్లలో ఎలాంటి సమస్య లేదని నిబంధనల ప్రకారమే డిజైన్లు ఉన్నాయని ఇంజనీర్లు తెలిపారు. అయితే కమిషన్ అడిగే ప్రశ్నలకే ఎదురు ప్రశ్నలు వేయడంతో పాటు అడిగిన ప్రశ్నలకు పొంతనలేని సమాధానాలు ఇచ్చారు అఅక్ష మాజీ ఇంజనీర్లు. దీంతో కమిషన్ ఇంజనీర్లపై ఆగ్రహం వ్యక్తం చేసింది. మధ్యాహ్నం వరకు ఇద్దరి ఇంజనీర్ల విచారణ ముగిసింది. కాసేపట్లో మరో ముగ్గురు ఇంజనీర్లను కమిషన్ విచారించనుంది. మరోవైపు మాజీ జలవనరుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ వి ప్రకాష్ బీఆర్‌కే భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. 37 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిందన్నారు. రఘు, వేధిర్ శ్రీరామ్ సీడబ్ల్యూసీ అంశాలను వక్రీకరించారని తెలిపారు. తాను కమిషన్ ముందు అఫిడవిట్ దాఖలు చేశానన్నారు. తుమ్మిడి హట్టి నిర్మాణం సాధ్యం కాదు అని వివరాలు ఇచ్చినట్లు తెలిపారు. తుమ్మడిహెట్టిపై కాగ్ ఆక్షేపాలను కమిషన్‌కు తెలియజేసినట్లు చెప్పారు. అఫిడవిట్ పరిశీలన తరువాత మళ్ళీ పిలుస్తామని కమిషన్ అన్నదన్నారు. దోషులకు శిక్ష పడాలనేదే తమ ఉద్దేశమని వి.ప్రకాష్ పేర్కొన్నారు.



# మాజీ ఎమ్మెల్యే ఇంటి ముందు విద్యుత్ నిలిపివేత

**వేములవాడ, ప్రజానావ:** వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు ఇంటి ముందు ఉన్న విద్యుత్ స్తంభాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. రెండో బైపాస్ ప్రధాన రహదారి నుంచి సంగీత నిలయానికి వెళ్లే దారిలో విద్యుత్ స్తంభాలకు ఉన్న విద్యుత్ సరఫరా పట్ల మున్సిపల్ కమిషనర్ అన్వేష్, సెస్ టౌన్ ఏఈ సిద్ధార్థలు చర్యలు చేపట్టారు. గత పదేళ్లుగా మాజీ ఎమ్మెల్యే రమేశ్ బాబు తన నివాసానికి వెళ్లే దారిలో మున్సిపల్ కరెంటు వినియోగం చేస్తున్నారన్న ఫిర్యాదు మేరకు ఈ చర్యలు చేపట్టారు. గతంలో ఏ శాఖకు చెందిన అధికారులు దగ్గర ఉండి విద్యుత్ సరఫరాను ఏర్పాటు చేశారో ప్రస్తుతం వారే తొలగించడం కొసమెరుపు.



# డెంగ్యూపై వదంతులను నమ్మొద్దు

- డిప్యూటీ డీఎంహెచ్ఓ రాజగోపాల్
- మామిడిపల్లిలో హెల్త్ క్యాంప్

**కోనరావుపేట, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది మంగళవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రై డే, ఫీవర్ సర్వే నిర్వహించి సీజనల్ వ్యాదుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. మెడికల్ క్యాంప్ నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ క్యాంప్ ను డిప్యూటీ డీఎంహెచ్ఓ రాజగోపాల్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డెంగ్యూ జ్వరంపై వస్తున్న వదంతులను ఎవరు నమ్మవద్దని, గ్రామంలోనే కాకుండా మండలంలో కూడా ఇంతవరకు డెంగ్యూ కేసులు ఒక్కటి కూడా నమోదు కాలేదన్నారు. వర్షాకాలంలో ఎక్కువగా సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని,



జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలోని ఆశాకార్యకర్త, ఏఎన్ఎంలకు వెంటనే తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓలు కృష్ణమూర్తి, బాల చందర్, డా. అఖిల్, సూపర్ వైజర్ రషీద్, ఏఎన్ఎం వరమ్మ, హెల్త్ అసిస్టెంట్ సవైలాల్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

WANTED
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్ /
జిల్లా ఇంచార్జీలు కావలెను



కరీంనగర్, జగిత్యాల,
ఖమ్మం, భద్రాద్రి
కొత్తగూడెం,
జయశంకర్
భూపాలపల్లి,
జనగామ,
మహబూబాబాద్,
సంగారెడ్డి,
సూర్యాపేట,
జోగులాంబ గద్వాల

అనతికాలంలో తెలుగు రాష్ట్రాల్లో సంచలన కథనాలు అందిస్తూ విశేష ప్రజాదరణ పొందిన 'ప్రజానావ' తెలుగు దినపత్రిక లో పనిచేయుటకు అన్ని జిల్లాల నుంచి స్టాఫ్ రిపోర్టర్ /జిల్లా ఇన్‌చార్జీలను ఆహ్వానిస్తోంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

సంప్రదించాల్సిన నెంబర్లు:
8185093931, 96766 67020,
72888 25681

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం
త్వరలో 'ప్రజానావ' సంస్థ ఆధ్వర్యంలో జర్నలిజం యందు శిక్షణ తరగతులు నిర్వహించబడును.

# మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం

**మానసిక వైద్య నిపుణుడు డా. ప్రవీణ్ కుమార్**



**కోనరావుపేట, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు మానసిక వైద్య నిపుణుడు డా. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థి దశలో ఎదుర్కొనే మానసిక సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే వయసులో మత్తు పదార్థాలకు లోనైతే భవిష్యత్తు అంధకారం అవుతుందని, చెడు వ్యసనాలపై దృష్టి పెట్టకుండా చదువుపై పూర్తిగా దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి వేణుమాధవ్, ప్రిన్సిపల్ కేదరేశ్వర్, సిహెచ్ఓ కృష్ణమూర్తి, హెల్త్ సూపర్వైజర్ రషీద్, ఏఎన్ఎం సరిత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు అండగా సీఎం సహాయ నిధి



**కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా**

**కోనరావుపేట, ప్రజానావ:** పేద ప్రజలకు అండగా సీఎం సహాయ నిధి ఉంటుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా అన్నారు. రాజన్న సిరిసిల్లా జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన సోమిశెట్టి దేవయ్యకు రూ. 60 వేలు, కచ్చకాయల హరీశ్‌కు రూ. 60 వేల చెక్కులను మంగళవారం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేదలకు ఆసరాగా ఉంటుందని, సీఎం సహాయ నిధి చెక్కుల మంజూరుకు కృషి చేసిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కచ్చకాయల ఎల్లయ్య, గ్రామ అధ్యక్షులు నీరటి సంజీవ్, మాజీ సర్పంచ్ బాల్ రెడ్డి, దేవయ్య, ప్రభాకర్ రెడ్డి, బాలరాజు, సురేశ్, మహేశ్, శ్రీనివాస్, బూర రమేశ్, కనకయ్య, కిషన్, దావీదు, వంగపల్లి శోభన్, భాస్కర్ బాబు రాజయ్య చెన్నయ్య రాజయ్య వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
విలేకరులు కావలెను
రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న ప్రజానావ తెలుగు దినపత్రికలో
పని చేయుటకు జర్నలిస్టులకు ఆహ్వానం.. జర్నలిస్టుగా రాణించాలనే తపన..
వార్తా సేకరణలో నేర్పరితనం ఉన్న వారికి సదావకాశం..
రాజన్న సిరిసిల్ల జిల్లాలో
ఈ కింది మండలాలకు విలేకరులు కావలెను

1. సిరిసిల్ల ఆర్‌సి ఇన్‌చార్జి
2. సిరిసిల్ల టౌన్/రూరల్
3. వేములవాడ ఆర్‌సి ఇన్‌చార్జి
4. వేములవాడ టౌన్
5. వేములవాడ రూరల్
6. తంగళపల్లి
7. ఎల్లారెడ్డిపేట
8. ముస్తాబాద్
9. వీర్నపల్లి
10. గంభీరావుపేట
11. ఇల్లంతకుంట
12. కోనరావుపేట
13. రుద్రంగి
14. బోయినపల్లి

9676667020, 8688523585



## చందుర్తిలో సభ్యత్వ నమోదు సమావేశం

**చందుర్తి, ప్రజానావ:** భారతీయ జనతా పార్టీ చందుర్తి మండల శాఖ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమం గురించి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కొక్కు దేవేందర్ యాదవ్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో విజయవంతం చేయాలని, క్రితం కన్నా ఎక్కువ సంఖ్యలో సభ్యత్వం నమోదు చేసి 17 కోట్ల సభ్యత్వమున్న మన రికార్డును మళ్లీ మనమే అధిగమించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల సామాన్య జనం భారతీయ జనతా పార్టీ వైపు సానుకూలంగా ఉన్నారని, ప్రతి వ్యక్తిని పార్టీలో చేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పోంచెట్టి రాకేశ్, సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి చిర్రం తిరుపతి, సహ ఇన్‌చార్జీలు పేరుక గంగరాజు, అంబాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మా సమస్యలను పరిష్కరించండి

### ప్రభుత్వ విప్‌ను కలిసిన సమగ్ర శిక్ష జాయింట్ యాక్షన్ కమిటీ



**వేములవాడ, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా సమగ్ర శిక్ష జాయింట్ యాక్షన్ ఉద్యోగులు కమిటీ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను మంగళవారం కలిసి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను విన్నవించారు. 15 ఏళ్లుగా సమగ్ర శిక్ష వివిధ విభాగాల్లో చాలీచాలని జీతాలు పనిచేస్తున్నామని, గతంలోనూ మా సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి చాలాసార్లు విన్నవించినప్పటికీ సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదన్నారు. దీనిపై స్పందించిన ఆది శ్రీనివాస్ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా సీఆర్పీల సంఘం అధ్యక్షుడు దేవేందర్, ప్రధాన కార్యదర్శి ఉపేందర్, ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, సభ్యులు మల్లేశం, వెంకటస్వామి, చందన్, లక్ష్మీపతి, రవి, రవికిరణ్, దేవరాజు, వినయ్, రాజేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



## డీజేలకు అనుమతి లేదు

### శాంతియుత వాతావరణంలో గణేశ్ నవరాత్రి వేడుకలు జరుపుకోవాలి
### రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**వేములవాడ, ప్రజానావ:** డీజేలకు అనుమతి లేదని, శాంతియుత వాతావరణంలో గణేశ్ నవరాత్రి వేడుకలు జరుపుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. వేములవాడ పట్టణ పరిధిలోని బింగి మహేశ్ ఫంక్షన్ హాల్‌లో రానున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వేములవాడ సబ్ డివిజన్ పరిధిలోని గణేశ్ మండపాల నిర్వహకులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోలీస్ వారికి సహకరిస్తూ శాంతియుత వాతావరణంలో వినాయక నవరాత్రి వేడుకలు జరుపుకోవాలని, పోలీస్ శాఖ నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. మండపాల పూర్తి బాధ్యత మండపాల నిర్వహకులదేనని, ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు తప్పకుండా ఏర్పాటు చేయలని సూచించారు. మండపాల వద్ద మద్యం తాగడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారితో పాటుగా మండపాల నిర్వహకులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రతి మండపం వద్ద విధిగా పాయింట్ బుక్ ఏర్పాటు చేయడం జరుగుతుందని పోలీస్ అధికారులు, బ్లూ కోల్ట్ సిబ్బంది తరచూ మండపాలను తనిఖీ చేస్తారని చెప్పారు. ఇనుప వస్తువులతో మండపాలు ఏర్పాటు చేయవద్దని, షార్ట్ సర్క్యూట్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి మండపాల నిర్వాహకులు విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలని సూచించారు. డీజేలకు అనుమతి లేదు నవరాత్రి వేడుకల సందర్భంగా మండపాల్లో నిమార్జనం రోజు డీజేలకు అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. అనుమతి లేకుండా డీజేను మండపాల్లో కానీ నిమార్జనం రోజున ఉపయోగిస్తే డీజే వారితో పాటు మండపాల నిర్వాహకులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే జిల్లాలో డీజే యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. ఇక నిమార్జనం రోజున గణేశ్ శోభాయాత్ర రాత్రి 12లోపు పూర్తయ్యేలా భక్తులు, మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలన్నారు. రెండు, మూడు రోజుల పాటుగా నిమార్జనం చేస్తూ ప్రజలకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, ఎస్ఐలు మారుతి, రమేశ్, అశోక్, అంజయ్య, సిబ్బంది, గణేశ్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



# అధికారికంగా విద్యుత్ చౌర్యం!

- 8 నెలలుగా చలామణి
- నూతన భవన నిర్మాణానికి దొంగతనంగా విద్యుత్ వినియోగం
- విద్యుత్ చౌర్యానికి వేములవాడ 'సెస్' అధికారుల సహకారం
- 'పవర్' శాఖలో పవర్ ఫుల్ లీడర్లు



**వేములవాడ, ప్రజానావ:** వేములవాడ పట్టణానికి చెందిన ఓ చిరు వ్యాపారి కష్టపడి నాలుగు కాసులు సంపాదించి ఓ స్థలం కొనుక్కుని ఇంటి నిర్మాణానికి పూనుకున్నాడు. అనుమతి కోసం మున్సిపల్ శాఖకు దరఖాస్తు పెట్టాడు. తనకు తెలిసిన మేస్త్రీతో పనికి ఒప్పందం కుదుర్చుకుని పని మొదలుపెట్టాడు. ఇంతవరకు సక్రమంగానే ఉన్నా... నిర్మాణానికి కావాల్సిన విద్యుత్ సరఫరా కోసం 'సెస్' అధికారులను కలిశాడు. అయితే ఇంటి నిర్మాణ అనుమతి రానిదే విద్యుత్ మీటరు ఇవ్వమని ఖరాఖండిగా చెప్పారు. మున్సిపల్ పాలకవర్గంలో ప్రధాన వ్యక్తికి మొరపెట్టుకున్నాడు. అతను కూడా గతంలో 'సెస్'ను ఏలిన ప్రబుద్ధుడే. అయినా సహకారం లభించలేదు. విధిలేక మళ్లీ విద్యుత్ శాఖలోని కిందిస్థాయి సిబ్బందిని కలిశాడు. తనకు తోచినంత 'కట్న కానుకలు' సమర్పించాడు. అయినా... కాలయాపన. ఏం చేయాలో తెలియక పలువురిని ఆశ్రయించాడు. వారి మాటలు విని విస్తుపోయాడు ఆ వ్యక్తి.



### కౌన్సిలర్లే కాంట్రాక్టర్లు!

వేములవాడలో ఇంటి నిర్మాణం చేయాలంటే మున్సిపల్ పాలకవర్గంలో కౌన్సిలర్లు ఉంటారు. వాళ్లకు కాంట్రాక్టు ఇస్తే అంతా వాళ్లే చూసుకుంటారు. ఇంటి అనుమతి.. విద్యుత్ మీటర్.. సెట్ బ్యాక్... ఇంకా ఏమైనా పక్కింటి గొడవలైనా సరే.. అంతా వాళ్లే చూసుకుంటారు. నువ్వు ఇవ్వాల్సింది డబ్బు మాత్రమే అని చెప్పడంతో సదరు వ్యక్తి ఖంగుతిన్నాడు. ఇది వేములవాడ పట్టణంలో నూతన గృహ నిర్మాణాలలో సామాన్యుడికి ఎదురవుతున్న దుస్థితి. సామాన్యుడు ఇంటి నిర్మాణం కోసం పడుతున్న ప్రయాసలు పడుతుంటే అధికారం.. దర్పం ఉందని వేములవాడలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరును ఒకసారి పరిశీలిద్దాం..

వేములవాడ పట్టణంలోని భీమేశ్వర గార్డెన్స్ సమీపంలో గత ఎనిమిది నెలలుగా నూతన భవన నిర్మాణం జరుగుతుంది. ఇంటి నిర్మాణం మొదలయ్యిందంటే విద్యుత్ వినియోగం అవసరం. కానీ ఇక్కడ జరుగుతున్న నిర్మాణానికి ఎలాంటి విద్యుత్ మీటరు వాడలేదు. అక్కడ ఉన్న విద్యుత్ లైన్ స్తంభాల నుంచి డైరెక్ట్‌గా తీగలు తగిలించారు. ఈ ఇంటి నిర్మాణానికి కావాల్సిన విద్యుత్ ను దొంగతనంగా వినియోగిస్తున్నారు. ఇదంతా సెస్ అధికారులకు తెలియకుండా జరుగుతుందంటే పొరపాటే. వేములవాడకు చెందిన కాంట్రాక్టర్ నామాల లక్ష్మీరాజం ఈ ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. ఆయన సతీమణి నామాల ఉమ ప్రస్తుతం వేములవాడ టౌన్ సెస్ డైరెక్టర్ గా ఉన్నారు. ఇంకేముంది ఇష్టారాజ్యంగా.. అధికారికంగా విద్యుత్ చౌర్యం చేస్తూ నిర్మాణాలు చేస్తున్నారు. 'ప్రజానావ' ప్రతినిధి అక్కడికి వెళ్లి పనిచేస్తున్న వారిని ప్రశ్నించగా ఇది 'నామాల లచ్చన్న' పని అంటూ సమాధానమివ్వడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.



### ఏఈ సాబ్ ఏ క్యా హై!

వేములవాడ పట్టణంలో విద్యుత్ వినియోగంలో సామాన్యుల పట్ల కఠినంగా వ్యవహరించే వేములవాడ టౌన్ ఏఈ సిద్దార్థ ఈ విద్యుత్ చౌర్యం విషయంలో సహకరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంగళవారం ఈ విషయాన్ని 'ప్రజానావ జర్నలిస్టు' ఏఈ దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో ఇది మీకు ఎవరు సమాచారం ఇచ్చారో నాకు తెలుసు అంటూ చర్యలు తీసుకుంటామని చెప్పారు. వెంటనే విద్యుత్ సిబ్బందిని పంపించి ఆ విద్యుత్ చౌర్యానికి చెందిన తీగలను తొలగింపజేశారు. దీనికి సంబంధించి జరిమానా విధిస్తామని చెప్పి కప్పిపుచ్చారు. 8 నెలలుగా తన కనుసన్నల్లో జరుగుతున్న విద్యుత్ చౌర్యం పట్ల చర్యలు తీసుకున్నట్లు చెప్పడం పట్ల పట్టణ ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఏఈ సాబ్ ఏ క్యా హై అంటూ ప్రశ్నిస్తున్నారు.

## స్థిరాస్తి వ్యాపారులు, నిర్వాసితులకు మధ్య వివాదం

### పరస్పరం రాళ్ల దాడితో ఉద్రిక్తత

**ఖమ్మం, ప్రజానావ:** ఖమ్మం జిల్లా కేంద్రంలోని లింగయ్య నగర్‌లో ఉద్రిక్తత నెలకొంది. కొంతకాలంగా స్థిరాస్తి వ్యాపారులు, నిర్వాసితులకు మధ్య వివాదం కొనసాగుతోంది. మంగళవారం జేసీబీలతో గుడిసెలు తొలగించేందుకు స్థిరాస్తి వ్యాపారుల అనుచరులు యత్నించారు. వారిని నిర్వాసితులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాలు రాళ్లు రువ్వుకున్నారు. రాళ్లదాడిలో పలువురికి గాయాలయ్యాయి. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితిని అదుపు చేశారు. ఐదేళ్లుగా స్థానికంగా ఉంటున్నామని భూదాన్ నిర్వాసితులు చెబుతున్నారు.

### జగన్ విదేశీ పర్యటనకు

## సీబీఐ కోర్టు అనుమతి

**అమరావతి, ప్రజానావ:** అక్రమాస్తుల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి సీబీఐ కోర్టులో ఊరట దక్కింది. విదేశాలకు వెళ్లేందుకు కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం విచారించిన సీబీఐ కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సెప్టెంబర్ 3వ తేదీ నుంచి 25 వ తేదీ వరకు యూకేలో ఉన్న కుమార్తె పుట్టినరోజు వేడుకలకు హాజరయ్యేందుకు సీబీఐ కోర్టులో జగన్ 15 రోజుల క్రితం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన కోర్టు మంగళవారం సాయంత్రం షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. యూకే వెళ్లే ముందు పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలు, మొబైల్ నంబరు, మెయిల్ వివరాలు కోర్టుకు, సీబీఐకి ఇవ్వాలని ఆదేశించింది. అదేవిధంగా ఐదేళ్ల కాలపరిమితితో కొత్త పాస్‌పోర్టు జారీకి అనుమతి ఇచ్చింది.

# సీక్వెల్‌కు ఈగ ఉంటే చాలు

## నానితో దర్శకుడు రాజమౌళి సరదా కామెంట్

విజువల్ వండర్ అనే పదానికి టాలీవుడ్‌లో అసలైన అర్థం చెప్పిన చిత్రం 'ఈగ'.. పెద్ద హీరోలతోనే కాదు.. చిన్న ఈగతోనూ సినిమా తీసి బాక్సాఫీసు దగ్గర రికార్డులు సృష్టించొచ్చని నిరూపించారు దర్శకుడు రాజమౌళి. తాజాగా ఈ సినిమా సీక్వెల్ గురించి నాని ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. రాజమౌళికి తనకు మధ్య జరిగిన సరదా సంభాషణను పంచుకున్నారు. 'నేను విజయేంద్ర ప్రసాద్ సర్‌ని ఎప్పుడూ 'ఈగ' సీక్వెల్ గురించి అడగలేదు. కానీ, రాజమౌళితో దీని గురించి సరదాగా చర్చించాను. 'ఈగ 2' చేస్తానన్నారు కదా.. ఇది ఎప్పుడు మొదలుపెడదామని అడిగాను. అప్పుడు దానికి ఆయన.. 'మేము ఈగ 2' చేసినా నీతో అవసరం లేదు. ఈగ ఉంటే చాలు. అదే సీక్వెల్‌లో తిరిగి వస్తుంది' అని చెప్పారు. 'ఈగ' సినిమా చేయాలనే ఆలోచన రావడమే చాలా గొప్ప విషయం. రాజమౌళి ధైర్యానికి మెచ్చుకోవాల్సిందే. ఆయనకు దీని సీక్వెల్ గురించి ఆలోచన వచ్చినప్పుడు కచ్చితంగా ఆ పనులు ప్రారంభిస్తారని నేను అనుకుంటున్నా. అదే జరిగితే మరో అద్భుతమైన చిత్రంతో ప్రపంచాన్ని ఆకర్షిస్తారు' అంటూ దర్శకధీరుడిపై ప్రశంసలు కురిపించారు. నాని, సమంత ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'ఈగ' బాక్సాఫీసు వద్ద ఘన విజయం అందుకుంది. సుదీప్ విలనిజం ఎంతగానో ఆకట్టుకుంది. 2012లో విడుదలైన ఈ సినిమా 2 జాతీయ అవార్డులు, 3 సైమా అవార్డులు, 5 సౌత్ ఫిల్మ్‌ఫేర్ అవార్డులు సాధించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం నాని 'సరిపోదా శనివారం' అంటూ సందడి చేసేందుకు సిద్ధమయ్యారు. వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది.






# నా జర్నీ ఇప్పుడే మొదలయ్యింది

## మిస్టర్ బచ్చన్ బ్యూటీ భాగ్యశ్రీ భోర్సే



కొన్ని రోజులుగా నెట్టింట మార్మోగుతున్న పేరు భాగ్య శ్రీ బోర్సే .ఇటీవలే మాస్ రవితేజ-హరీష్ శంకర్‌కాంబినేషన్‌లో వచ్చిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది. సినిమా విడుదల కాకముందే ఏదో ఒక స్టిల్‌తో నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం ఊహించని డిజాస్టర్ టాక్ తెచ్చుకుంది. సినిమా హిట్టా.. ఫట్టా అనేది పక్కన పెడితే.. తెలుగులో ఇది మొదటి సినిమా కాబట్టి నటిగా తన ఫీలింగ్‌ను అందరితో షేర్ చేసింది. మీ అమ్మాయిపై మీరంతా చూపిస్తున్న ప్రేమ ఊహించలేనిది. నా ప్రయాణం కేవలం ఇప్పుడే మొదలైంది. నా నెక్ట్స్ చాప్టర్‌ను మీతో పంచుకునేందుకు వేచి ఉండలేకపోతున్నా.. అంటూ సోషల్ మీడియాలో రాసుకొచ్చింది భాగ్య శ్రీ బోర్సే.


# అక్కడ సినిమా అంటే ఎక్కువ గంటలు పని చేయాల్సిందే..

## - కృతిశెట్టి

ఉప్పెన తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న కృతి శెట్టి.. ఆ తర్వాత తెలుగు, తమిళంలో బిజీగా కథానాయికగా మారిపోయింది. కానీ కొన్నాళ్లకు తెలుగులో వరుస ఫ్లాపులు రావడంతో సైలెంట్ అయి-ుపోయింది. ఇటీవలే మనమే తో మరోసారి తెలుగు ఆడియన్స్ ముందుకు రాగా.. ఈ మూవీ కూడా బోల్తాపడింది. దీంతో ఇప్పుడు కృతికి తెలుగులో ఆఫర్స్ మాత్రం రావడం లేదు. ఉప్పెన తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న కృతి శెట్టి.. ఆ తర్వాత తెలుగు, తమిళంలో బిజీగా కథానాయికగా మారిపోయింది. కానీ కొన్నాళ్లకు తెలుగులో వరుస ఫ్లాపులు రావడంతో సైలెంట్ అయిపోయింది. ఇటీవలే మనమే తో మరోసారి తెలుగు ఆడియన్స్ ముందుకు రాగా.. ఈ మూవీ కూడా బోల్తాపడింది. దీంతో ఇప్పుడు కృతికి తెలుగులో ఆఫర్స్ మాత్రం రావడం లేదు. ప్రస్తుతం కృతి శెట్టి మలయాళంలో అజయంతే రందం మోషణం చిత్రంలో నటిస్తుంది. జితిన్ లాల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో టోవినో థామస్ హీరో. మూడు ముఖ్యమైన 1900, 1950, 1990లలో జరిగే కథాంశంతో ఈ చిత్రాన్ని మూడు తరాల ప్రయాణాన్ని తెరపై చూపించనున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కృతి శెట్టి.. ఇండస్ట్రీలో ఎదురయ్యే అనుభవాలు, సవాళ్లను చెప్పుకొచ్చింది. మలయాళం ఇండస్ట్రీలో ఎక్కువ గంటలు పనిచేయాల్సి ఉంటుందని.. సరిగా నిద్రలేకపోవడంతో కళ్లు చిన్నవిగా మారిపోయాయని తెలిపింది. నిద్రలేమి కారణంగా తాను ఏ పని సరిగా చేయలేకపోయానని.. హీరో టోవినో మాత్రం చాలా నెలలుగా నిద్రలేకుండానే పనిచేస్తున్నాడని.. అతడిలో ఉన్న శక్తి, అంకితభావం చూసి ఆశ్చర్యపోయానని తెలిపింది. అతడు అలసిపోయినా తాను కనిపెట్టలేకపోయానని తెలిపింది.

# బీఆర్ఎస్ పాపాల చిట్టాలో సీఎంఆర్ఎఫ్

## చికిత్సలు.. రోగులు లేకుండానే నిధులు కాజేత
## తీగ లాగితే కదులుతున్న నేతల డొంక





**ఖైరతాబాద్, ప్రజానావ:** గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన పాపాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. కొన్ని సమస్యలను బీఆర్ఎస్ నేతలు స్వయంగా తెలియ చేసి తమ పాపాలను తామే బయటపెట్టుకుంటున్నారు. కేటీఆర్, హరీష్ రావులు లేవనెత్తుతున్న సమస్యలన్నీ కొత్తగా వచ్చినవి కావు. వారు ప్రస్తావించే అంశాలన్నీ పదేళ్లుగా వారి పాలనలో ఉన్నవే. స్కూళ్లల్లో టీచర్ల కొరత, స్కూళ్లు మూసివేత, ఆస్పత్రులు ఇలా చెప్పుకుంటూ పోతే అన్నీ బిఆర్ఎస్ పాపాలకి ఉదాహరణలుగా చెప్పుకోవాలి. తాజాగా రాష్ట్రంలో వెలుగులోకి వచ్చిన ముఖ్యమంత్రి సహాయనిధి సిఎంఆర్ఎఫ్ స్కామ్ కూడా ఇందులో ఒకటి. తాజాగా ప్రభుత్వం దృష్టి పెట్టడంతో కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాకం బట్టబయలైంది. రోగులకు చికిత్స అందించ కుండానే నకిలీ బిల్లులతో సిఎంఆర్ఎఫ్ నిధులు కొట్టేసి మోసాలకు పాల్పడ్డట్లు తాజాగా సిఐడి గుర్తించింది. ఈ మేరకు ప్రజల సొమ్మును లూటీ చేసిన ఆసుపత్రులపై కేసులు నమోదు చేసింది. హైదరాబాద్, ఖమ్మం, నల్గొండ, కరీంనగర్, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లోని మొత్తం 28 ప్రైవేటు ఆసుపత్రులపై ఆరు కేసులను సిఐడి బుక్ చేసింది. గతేడాది ఏప్రిల్‌కు ముందు ఆసుపత్రులు ఈ దందాను నిర్వహించినట్లు ఎఫ్ఐఆర్‌లో సిఐడి వెల్లడించింది. నకిలీ బిల్లులతో ప్రైవేటు ఆసుపత్రులు ముఖ్యమంత్రి సహాయనిధి డబ్బులను దుర్వినియోగం చేస్తున్నాయనే ఆరోపణలు తీవ్ర స్థాయిలో ఉన్నాయి. ఇప్పుడు బయటపడుతున్న కుంభకోణాలపై కెటిఆర్, హరీష్ రావులు స్పందించడం లేదు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు, ఆసుపత్రి సిబ్బంది కలిసి నిధులు దోచేశారని తన ఎఫ్ఐఆర్‌లో తెలిపింది. దీనిపై సచివాలయ రెవెన్యూ మంత్రిత్వ శాఖ సెక్షన్ ఆఫీసర్ డిఎస్ఎన్ మూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందులో కొందరు రాజకీయ నాయకుల ప్రమేయం ఉన్నట్లు ఫిర్యాదులో పొందు పరిచారు. ఈ కుంభకోణంలో కొందరు బడా నాయ కులు సైతం ఉన్నట్లు తేలింది. దీనితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకున్నారు. విచారణను సిఐడికి బదలాయించారు. రంగంలో దిగిన సీఐడీ అధికారులు తమ దర్యాప్తును ఉధృతం చేశారు. పలు ఆసుపత్రులపై ఈ ఎఫ్ఐ ఆర్‌లు నమోదవ్వడంతో సిఎం సహాయ నిధి జాబితా నుంచి తొలగించారు. ఇదిలా ఉండగా, ఈ కేసులో గతంలోనే మాజీ మంత్రి, ప్రస్తుత బిఆర్ఎస్ ఎంఎల్ఏ హరీశ్ రావు వద్ద ఎంట్రీ ఆపరటర్‌గా పని చేసే వ్యక్తిపై సైతం కేసు నమోదైంది. కరుణ శ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, ఐఎస్ సదన్ ఎక్స్ రోడ్, శ్రీ కృష్ణ హాస్పిటల్, సైదాబాద్, జనని హాస్పిటల్, సైదాబాద్, హిరణ్యా హాస్పిటల్, మీర్‌పేట్, డెల్టా హాస్పిటల్, హస్తినాపురం, శ్రీ రక్షా హాస్పిటల్, బిఎన్ రెడ్డి నగర్, ఎంఎంఎస్ హాస్పిటల్, సాగర్ రింగ్ రోడ్, ఎడిఆర్ఎం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, శారదానగర్,ఎంఎంవి ఇందిరా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, కొత్తపేట, శ్రీ సాయి తిరుమల హాస్పిటల్, బైరామల్ గూడ. ఖమ్మంలో : శ్రీ శ్రీకర మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, గ్లోబల్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, డా. జె.ఆర్.ప్రసాద్ హాస్పిటల్, శ్రీ వినాయక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, శ్రీ సాయి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, వైష్ణవి హాస్పిటల్, సుజాత హాస్పిటల్, న్యూ అమృత హాస్పిటల్, ఆరెంజ్ హాస్పిటల్, మెగశ్రీ హాస్పిటల్, బోనకల్. నల్గొండలో : నవీనా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, మిర్యాలగూడ, మహేష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, మిర్యాలగూడ, అమ్మ హాస్పిటల్, రైల్వే స్టేషన్ రోడ్. కరీంనగర్‌లో : సప్తగిరి ఆసుపత్రి, జమ్మికుంట, శ్రీ సాయి ఆసుపత్రి, పెద్దపల్లి. వరంగల్ లో : రోహిణి మెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్., హనుమకొండ. మహబూబాబాద్‌లో: శ్రీ సంజీవిని హాస్పిటల్, సిద్దార్థ హాస్పిటల్. వివరాలు వెల్లడయ్యాయి. వీటి వెనక బిఆర్ఎస్ నేతల ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది.

# టీచర్లు లేక పాఠశాలలు మూసివేత

- గిరిజన ప్రాంతాల్లో 43 స్కూళ్ల మూత
- సిగ్గు చేటని వ్యాఖ్యానించిన హరీష్ రావు



**హైదరాబాద్, ప్రజానావ:** ఉపాధ్యాయులు లేక పాఠశాలలు మూతపడటమంటే పాలకులు సిగ్గుతో తలదించుకోవాలని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని హరీశ్ రావు అన్నారు. ముఖ్యంగా విద్యా, వైద్యం, తాగునీరు, రైతు రుణమాఫీ విషయాల్లో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు మూసివేశారని, తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారంటూ హరీశ్ రావు ఎక్స్(ట్విటర్) వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో నిర్మితమవుతుంది.. కానీ కాంగ్రెస్ పాలనలో విద్యార్థులు తరగతి గదుల్లో చదువుకు నోచుకో ని పరిస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకటి కాదు రెండు కాదు 43 పాఠశాలలు.. అదీ గిరిజనులు అధికంగా నివసించే ప్రాంతం లో ఉపాధ్యాయులు లేక మూతపడటమంటే పాలకులు సిగ్గుతో తలదించుకోవాన్నారు. ప్రభు త్వ తప్పిదం వల్ల గిరిజనులు ప్రాథమిక విద్యకు దూరం కావడం క్షమించరాని నేరమని తెలిపారు. కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించింది ఉన్న స్కూళ్లను మూత వేయడానికా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని మూతపడ్డ 43 ప్రభుత్వ పాఠశాలలను వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. టీచర్ల నియామకం జరిగేవరకు విద్యా వాలంటీర్లను నియమించాలని విద్యాశాఖ మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు లేరన్న కారణంతో రాష్ట్రంలో ఏ ఒక్క పాఠశాల కూడా మూతపడకుండా చూడాలని, వెంటనే ముఖ్య మంత్రి స్థాయిలో విద్యాశాఖపై సమీక్ష నిర్వ హించి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపాలని ఎక్స్ వేదికగా కోరారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో నిర్మితమ వుతుందని, కానీ కాంగ్రెస్ పాలనలో విద్యా ర్థులు చదువుకు నోచుకోని పరిస్థితి దాపురిం చిందని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ప్రభుత్వ తప్పిదం వల్ల గిరిజనులు ప్రాథమిక విద్యకు దూరం కావడం క్షమించరాని నేరమంటూ ధ్వజమెత్తారు.





# కర్ణాటకలో మరొకసారి కుర్చీలాట

## సిద్ధరామయ్యను దించే ఎత్తులు

### అస్థిరపరిచే కుట్రలో బీజేపీ చాపకింద నీరులా యత్నాలు

**కర్ణాటకలో మరొకసారి సిఎం పదవి కోసం కుర్చీలాట మొదలైంది. గవర్నర్‌ను ఉపయో గించి బిజెపి చాపకింద నీరులా పావులు కదుపుతోంది. సిఎం సిద్ధరామయ్య వంస స్కాంలతో ఉక్కిరిబిక్కిరి అవు తూ ఉండడంతో కన్నడ రాజకీయం రసకందాయంలో పడింది. సిద్ధరామయ్య ఎంతగా బలహీనపడితే డికె శివకుమార్ అంతగా బలపడతారు. తాను కోరుకున్న సిఎం కుర్చీని దక్కించుకుంటారు. అయితే ఎట్టి పరిస్థితు ల్లోనూ సిఎం పదవిపై తొందరపడి నిర్ణయం తీసుకునే పరస్థితిలో కాంగ్రెస్ అధిష్టానం లేదు. ఎందుకంటే ఇది పార్టీలో తీవ్ర ప్రభావం చూపగలదన్న భయంలో ఉన్నారు.**

**బెంగళూరు :** కర్నాటకలో ఏమాత్రం మార్పునకు మొగ్గ చూపినా దాని ప్రభావం వెంటనే తెలంగానపై పడుతుంది. ఇక్కడా మార్పు కోసం పోరాడేందుకు అనేకులు సిద్దంగా ఉన్నారు. అయితే సిద్దరమాయ్య కేసులను దృష్టిలో పెట్టుకుని సిఎం పోస్టు కోసం కీలక నేతలు తెరవెనక మంత్రంగాలు మొదలుపెట్టారు. 'మూడా భూములు', 'వాల్మీకి కార్పొరే షన్', 'రాష్ట్ర వక్ఫ్ బోర్డు' ఇలా వరుస స్కాంలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న సిద్ధరామయ్య సిఎం పదవి నుంచి దిగిపోవడానికి సిద్ధమైనట్టు వార్తలు వస్తున్నాయి. ఇదే సమయంలో సిద్ధరామయ్యకు అధిష్టానం అండగా నిలవ డంతో పెద్దగా ప్రభావం కనిపించడం లేదు. లేకపోతే ఈ పాటికి కర్నాటకలో రచ్చ మొదలయ్యేది. సిఎం పదవి కోసం పోటీ రాజకీయాలు జరుగుతున్నా..అధిష్టాన అండతో పెద్దగా బయటపడడం లేదు. గతంలో లాగా ఇప్పుడు కాంగ్రెస్‌లో ధిక్కార రాజకీయాలు తగ్గాయి. కాం గ్రెస్‌లో ప్రతి చిన్న నిర్ణయానికి అధిష్టాన నిర్ణయంపై ఆధారపడతారు కనుక సిద్దరామయ్య కూడా ఏ పనిచేసినా అధిష్టానం కనుసన్నల్లోనే పనిచేస్తున్నారు. అధిష్టానం చేతిలో కీలుబొమ్మలుగా వీరవిధేయత ప్రకటించినంత కాలం పదవికి ఢోకా లేదు. అయితే ఏ రాష్ట్రంలో అయి నా ముఖ్యమంత్రి నిర్ణయాలను, వ్యక్తిగత స్వేచ్ఛా నిర్ణయా లపై నిఘా పెట్టి ఎప్పటి కప్పుడు అధిష్టానానికి కొందరు సమాచారం చేరవేస్తూనే ఉంటారు. కర్ణాటకలో తాజా పరిణామాలతో కనీసం 15 నెలలు కూడా కాకముందే సిఎం పదవి కోసం కుర్చీలాట మొదలైంది. సిఎం సిద్ధరామయ్య వరుస స్కాంలతో ఉక్కిరిబిక్కిరి అవుతూ ఉండడంతో కన్నడ రాజకీయం రసకందాయంలోపడింది. ప్రస్తుతం ఇదే అదునుగా సిఎం పోస్టు కోసం కీలక నేతలు తెరవెనక మంత్రంగాలు మొదలుపెట్టారు. కర్ణాటకలో సిఎం మార్పు త్వరలోనే జరుగనున్నట్లు పరిస్థితులు తెలుపుతున్నాయి. ఇదే అదనగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కెపిసిసి అధ్యక్షుడు డికె శివకుమార్ తెరవెనక మంత్రంగాన్ని ప్రారంభించినట్లు తెలుస్తున్నది. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అందరూ డికె శివకుమార్ సిఎం అవుతారని అంచనాలు వేశారు. అయితే అధిష్టానం అనూహ్యంగా సిద్దరామయ్యను తెరమీదకు తెచ్చింది. సిఎం పదవిని కట్టబెట్టింది. దీనిపై డికె వర్గం ఎంఎల్ఎలు గుర్రుగా ఉన్నారు. కానీ, మెజారిటీ ఎంఎల్ఎలు మద్దతు సిద్దరామయ్యకు ఉండడంతో ఇంతకాలం సిఎం పదవికి ముప్పుకలగలేదు. డికెకు ఉపముఖ్యమంత్రి పదవిని ఇచ్చి అధిష్టానం బుజ్జగించింది. మల్లికార్జున ఖర్గే లేదా మంత్రి జి పరమేశ్వర్‌కు కట్టబెట్టాలని అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తున్నది. దీంతో డికె శివకుమార్ ఉన్నపళంగా సోమవారం రాత్రి జార్కిహోళిని కలిశారు. ఒకవేళ సిఎంగా తనను ప్రతిపాదించి మద్దతు ప్రకటిస్తే కెపిసిసి అధ్యక్ష పదవి వచ్చేలా తాను అధిష్టానాన్ని ఒప్పిస్తానని జార్కిహోళికి డికె ఆఫర్ చేసినట్లు తెలుస్తున్నది. కాగా ఇప్పటికే జార్కి హోళికి 20 మంది ఎంఎల్ఎల మద్దతు ఉంది. అందుకే జార్కి హోళి, డికె శివకుమార్‌కు తాను మద్దతు ప్రకటించలేదు. వాల్మీకి (ఎస్‌టి) వర్గానికి చెందిన బలమైన నేతగా అధిష్టానం తనను సిఎంగా ప్రకటిస్తుందన్న ఆశ ఆయనలో బలంగా ఉంది. శివకుమార్, మల్లికార్జున ఖర్గే, జార్కి హోళి ప్రస్తుతం సిఎం రేసులో ఆశావహులుగా ఉన్నారు. దళిత వర్గ ప్రజలు, వాల్మీకి గురుపీఠ స్వామిజీ ప్రసన్నానంద మాత్రం జార్కిహోళికే తన మద్దతు ప్రకటించారు. మరోవైపు కాంగ్రెస్‌యేతర ప్రభుత్వాలను ఏదో మిషతో కూల్చివేయాలని బిజెపి పొంచి చూస్తూనే ఉంది. గత పదేళ్ళలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలను తనకు స్వయంగా బలం లేక పోయినా విపక్ష ఎంఎల్ఎలను ప్రలోభపెట్టో, దర్యాప్తు సంస్థలతో భయపెట్టో రెండుగా చీల్చి ఆ ప్రభుత్వాలను పడగొట్టిన చరిత్ర బిజెపిది. మరోసారి కర్నాటక కాంగ్రెస్‌పై తన పంజా విసిరింది. 'ముడా' స్కాంలో సిద్దరామయ్యను విచారణకు ఆదేశించడం ద్వారా గవర్నర్ వ్యవస్థను మరోసారి బిజెపి దుర్వినియోగ పర్చింది. అందుకే కర్ణాటక గవర్నర్ బిజెపి పెద్దలు చెప్పినట్లు విచారణకు అనుమతి ఇచ్చారు. ఇలాంటి సమయంలోనే కాంగ్రెస్ అధిష్టానం సిద్దరామయ్యకు అండగా నిలబడడంతో డికె శివకుమార్‌కు తక్షణ ప్రయోజనం కలగకపోవచ్చు.

# యాదాద్రీశుడి సేవలో గవర్నర్ జిష్ణుదేవ్

### స్వాగతించిన ఆలయ అధికారులు



**యాదగిరిగుట్ట, ప్రజానావ:** రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం యాదాద్రి ఆలయానికి చేరుకున్న గవర్నర్‌కు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ నారసింహుడికి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత గవర్నర్‌కు ఆలయ అర్చకులు వేదాశీర్వ చనం అందించగా, అధికారులు స్వామివారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందచేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మంగళ, బుధ, గురువారాల్లో పలు జిల్లాల్లో పర్యటించనున్నారు. రోడ్డు మార్గాన యాదగిరిగుట్టకు చేరుకున్న ఆయన లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి బయలుదేరి ఉదయం 11.30 గంటలకు ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటిగంటకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో 25 మంది జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు పొందిన రచయితలు, కళాకారులతో సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి చేరుకొని పూజలు నిర్వహించిన అనంతరం సరస్సును సందర్శించనున్నారు. అక్కడి నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురంలోని కోటగుళ్లను సందర్శించి పూజలు చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం బుస్సాపురంలోని లక్నవరం సరస్సు వద్దకు చేరుకొని హరిత రిసార్ట్‌లో ఇతర అధికారులతో కలిసి రాత్రి బస చేయనున్నారు. బుధవారం ఉదయం 8 గంటలకు లక్నవరం నుంచి హనుమకొండ జిల్లా పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నెల 29న మధ్యాహ్నం 2.20 గంటలకు ఆలేరు మండలంలోని కొలనుపాక జైన దేవాలయాన్ని, సోమేశ్వర ఆలయాన్ని దర్శించుకుంటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు భువనగిరి పట్టణ పరిధిలోని స్వర్ణగిరి ఆలయాన్ని సందర్శిస్తారు. సాయంత్రం 5.15 గంటలకు భువనగిరి కలెక్టరేట్‌లో రచయితలు, కళాకారులు, రాష్ట్ర జాతీయ అవార్డు గ్రహీతలను కలుస్తారు.



# చట్టబద్ధంగానే గెస్ట్‌హౌజ్ నిర్మాణం

### పట్నం మహేందర్ రెడ్డి వివరణ

**హైదరాబాద్, ప్రజానావ:** ప్రభుత్వ నిబంధనల ప్రకారమే గెస్ట్ హౌస్ నిర్మించుకున్నానని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. హిమాయత్ సాగర్‌లో నిర్మించిన గెస్ట్ హౌస్‌పై ఆయన వివరణ ఇచ్చారు. చెరువులు ఆక్రమించి కట్టిన నిర్మాణాల కూల్చివేతను సమర్థిస్తున్నట్లు చెప్పారు.ఎలాంటి చెరువు భూమిని ఆక్రమించి ఇల్లు నిర్మించలేదు. నిబంధనల ప్రకారం లేదని తేలితే నేనే కూల్చివేస్తాను. 111 జీవో పరిధిలో చాలా మంది మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇళ్లు నిర్మించుకున్నారు. ప్రభుత్వం అనుమతిస్తేనే నిర్మించుకున్నాం. నా గెస్ట్ హౌస్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉంటే కూల్చేయమని చెప్తున్నా. పట్టాభూమిలోనే నా గెస్ట్ హౌస్ ఉంది. దగ్గర్లోనే చాలా ఫంక్షన్ హాళ్లు ఉన్నాయి. పూర్తి వివరాలు తెలియ కుండా కేటీఆర్ మాట్లాడారని భావిస్తున్నానని చెప్పారు.

www.prajanaava.in
హైదరాబాద్
బుధవారం, ఆగస్టు 28, 2024
ప్రజా నావ
ప్రతి అక్షరం జనం కోసం..




# హర్మన్ కెప్టెన్.. మంధాన వైస్ కెప్టెన్

## టీ20 ప్రపంచకప్ టోర్నీకి టీమిండియా జట్టు ప్రకటన

**ముంబై:** యూఏఈ వేదికగా జరిగే మహిళల టీ20 ప్రపంచకప్ కోసం భారత జట్టును ఎంపిక చేశారు. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా, స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. మెగా టోర్నీ కోసం 15 మందితో కూడిన టీమ్‌ను భారత క్రికెట్ బోర్డు మంగళవారం ప్రకటించింది. అక్టోబర్ 3 నుంచి 20 వరకు యూఏఈలో ఈ వరల్డ్‌కప్ జరుగనుంది. ఇందులో మొత్తం 10 జట్లు పోటీ పడనున్నాయి. జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్‌లు ఒకే గ్రూపులో ఉన్నాయి. గ్రూప్-ఏలో భారత్‌తో పాటు పాకిస్థాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, శ్రీలంక జట్లకు చోటు కల్పించారు. గ్రూప్-బీలో సౌతాఫ్రికా, ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, స్కాట్లాండ్ జట్లు స్థానం దక్కించుకున్నాయి. టీమిండియా తన తొలి మ్యాచ్‌ను అక్టోబర్ 4న న్యూజిలాండ్‌తో ఆడనుంది. ఇక రెండో మ్యాచ్‌లో అక్టోబర్ 6న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను ఎదుర్కొంటోంది. 9న శ్రీలంకతో, 16న ఆస్ట్రేలియాలతో భారత్ పోటీ పడుతుఓంది. ప్రతి గ్రూప్ నుంచి లీగ్ దశలో అగ్రస్థానంలో రెండు జట్లు సెమీస్‌కు చేరుతాయి. సెమీ ఫైనల్‌తో పాటు ఫైనల్‌కు రిజర్వ్‌డే ఉంటుంది. ఫైనల్ అక్టోబర్ 20న జరుగుతుంది. ఇక వరల్డ్‌కప్ కోసం ఎంపిక చేసిన టీమ్‌లో అనుభవజ్ఞులకే ప్రాధాన్యత ఇచ్చారు. ఊహించినట్టే కీలక ఆటగాళ్లందరూ జట్టులో చోటు సంపాదించారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్, మంధాన ఈసారి కూడా జట్టు బాధ్యతలను మోయను న్నారు. షఫాలీ వర్మ, దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, పుజా వస్త్రాకర్, అరుంధతి రెడ్డి, రేణుకా సింగ్, యాస్తికా భాటియా, హేమలత తదితరులు వరల్డ్‌కప్ జట్టులో స్థానం సొంతం చేసుకున్నారు. శ్రేయంకా పాటిల్‌ను ఎంపిక చేసినా ఫిట్‌నెస్ సాధించకపోతే ఇతరులకు ఛాన్స్ ఇస్తారు. రాధా యాదవ్, సంజనా, ఆశా శోభనలు కూడా జట్టులో స్థానం దక్కించుకున్నారు.




### ఏళ్లుగా ఎదురుచూపు!

ప్రపంచకప్ వంటి మెగా టోర్నమెంట్‌లో టీమిండియా ప్రతిసారి ఫేవరెట్‌గా దిగడం అనవాయితీగా వస్తోంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతూకంగా ఉన్న భారత జట్టు ఈసారి కూడా ఫేవరెట్‌గా కనిపిస్తోంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే క్రికెటర్లకు జట్టులో కొదవ లేదు. హర్మన్‌ప్రీత్, షఫాలీ, మంధాన, రోడ్రిగ్స్, పుజా వస్త్రాకర్, దీప్తి శర్మ, యాస్తికా భాటియా, రిచా వంటి మ్యాచ్ విన్నర్లు జట్టులో ఉన్నారు. ఎలాంటి పరిస్థితి ఎదురైనా తట్టుకుని ముందుకు సాగే సత్తా వీరి సొంతం. రాధా యాదవ్, రేణుకా సింగ్, దీప్తి, వస్త్రాకర్ తదితరులతో బౌలింగ్ చాలా బలంగా ఉంది. రెండు విభాగాల్లోనూ సమతూకంగా ఉన్న టీమిండియా ఈసారి ఎలాగైనా ట్రోఫీ సాధించాలనే పట్టుదలతో ఉ ంది. చాలా కాలంగా భారత జట్టు వరల్డ్‌కప్ ట్రోఫీ కోసం ఎదురు చూస్తోంది. ఈసారైనా టీమిండియా ప్రయత్నం ఫలిస్తుందా లేదా వేచిచూడాల్సిందే.



# ఐసీసీ చైర్మన్‌గా జై షా

## ఎన్నిక ఏకగ్రీవం.. అతి పిన్న వయసులో చైర్మన్‌గా రికార్డు


దుబాయి: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కొత్త చైర్మన్‌గా భారత్‌కు చెందిన జై షా ఎన్నికయ్యారు. జై షా ప్రస్తుతం భారత క్రికెట్ బోర్డు కార్యదర్శిగా కొనసాగుతున్నారు. కాగా, జై షా ఐసీసీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డిసెంబర్ 1న ఆయన ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతారు. రెండేళ్ల పాటు జై షా ఈ పదవిలో కొనసాగుతారు. ఇదే సమయంలో ఐసీసీ చైర్మన్‌గా ఎన్నికైన అతిపిన్న వయస్కుడిగా జై షా గుర్తింపు దక్కించుకున్నారు. జై షా 35 ఏళ్ల వయసులో ఐసీసీ చైర్మన్ పదవిని సొంతం చేసుకున్నారు. ఇదిలావుంటే భారత్ తరఫున ఈ పదవిని దక్కించుకున్న ఐదో వ్యక్తి జై షా. మరోవైపు ప్రస్తుతం ఐసీసీ చైర్మన్‌గా గ్రెగ్ బార్క్‌లే కొనసాగుతున్నారు. ఆయనకు మరో దఫా చైర్మన్‌గా కొనసాగడానికి అర్హత ఉన్నా.. ఈ పదవిని చేపట్టేందుకు విముఖత చూపారు. దీంతో ఆయన స్థానంలో తాజాగా బీసీసీఐకి చెందిన జై షాకు ఈ చైర్మన్ పదవి దక్కింది. కొన్నేళ్ల క్రితం జై షా భారత క్రికెట్‌లో ప్రవేశించారు. క్రికెట్ అభివృద్ధికి జై షా పలు విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. దేశవాళీ క్రికెట్‌ను పటిష్ఠం చేసేందుకు జై షా పలు చర్యలు చేపట్టారు. కాగా, ఐసీసీ చైర్మన్ పదవి దక్కించుకున్న జై షాకు అభినందనలు వెల్లువెత్తాయి. పలువురు ప్రముఖులు ఆయనను అభినందించారు.

### జైషాకు హెచ్‌సీఏ అధ్యక్షుడి శుభాకాంక్షలు

ఐసీసీ నూతన చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన బీసీసీఐ ప్రధాన కార్యదర్శి జైషాకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) తరఫున ఆ సంఘం అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు శుభాకాంక్షలు తెలిపారు. మంచి పరిపాలన దక్షుడైన జైషా నాయకత్వంలో ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ అభివృద్ధి సరికొత్త పుంతలు తొక్కనుందని అభిప్రాయ పడ్డారు. కొత్త బాధ్యతలను జైషా సమర్థవంతంగా నిర్వహించి, బీసీసీఐకి, దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని జగన్‌మోహన్ రావు ఆకాంక్షించారు.

# వంద కోట్లు ఇచ్చినా కోహ్లీ ఆర్సీబీని వీడడు

## టీమిండియా మాజీ ఆటగాడు, కామెంటేటర్ ఆకాశ్ చోప్రా




**ముంబై:** టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై టీమిండియా మాజీ ఆటగాడు, కామెంటేటర్ ఆకాశ్ చోప్రా ప్రశంసల జల్లు కురిపించాడు. ఐపీఎల్‌లో ఎన్ని ఆఫర్లు వచ్చినా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) జట్టును కోహ్లీ వీడలేదని గుర్తు చేశాడు. ఆ జట్టుకు విధేయుడిగా ఉన్నాడని ప్రశంసించాడు. ఐపీఎల్ 2025 మెగా వేలం నేపథ్యంలో స్టార్ ఆటగాళ్లు జట్లు మారుతారని జోరుగా ప్రచారం జరుగుతుంది. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్ ముంబై ఇండియన్స్ జట్టును వీడుతున్నారని, ఈ ముగ్గురు కెప్టెన్సీ అవకాశాల కోసం ఇతర జట్లలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని నేషనల్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. లక్నో సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ వంటి ఫ్రాంచైజీలు రోహిత్ శర్మ కోసం రూ. 50 కోట్ల ప్రైజ్‌మనీ సిద్ధం చేసుకున్నాయని, అతను వేలంలోకి వస్తే ఆల్‌టైమ్ రికార్డు ధర పలుకుతాడని క్రికెట్ విశ్లేషకులు అంటున్నారు. ఈ క్రమంలో విరాట్ కోహ్లీ ఐపీఎల్ జర్నీ గురించి తన యూట్యూబ్ చానెల్ వేదికగా మాట్లాడిన ఆకాశ్ చోప్రా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. గతంలో ఎన్ని ఆఫర్లు వచ్చినా.. జట్టును వదల్లేదని, ఇప్పుడు రూ. 100 కోట్లు ఇచ్చినా ఆర్‌సీబీని వీడడని తెలిపాడు. 'విరాట్ కోహ్లీ ఓటమిని ఏ మాత్రం సహించడు. కానీ అతను ఇప్పటికీ ఆర్సీబీతోనే ఉన్నాడు. ఎందుకంటే ఆ జట్టుతో అతని అనుబంధం అలా ఉంది. లాయల్టీ అంటే రాయల్టీ. ఐపీఎల్‌లో అతనికి చాలా ఆఫర్లు వచ్చాయి. కానీ ఏనాడు ఆర్సీబీతో ఉన్న బంధాన్ని తెంచుకోలేదు. అతను ఎప్పుడూ ఆర్సీబీకి విధేయుడిగానే ఉన్నాడు. అదే అతను ఏంటో తెలియజేస్తోంది. అరంగేట్ర ఐపీఎల్ 2008 సీజన్‌లో ఆర్సీబీలోకి అడుగుపెట్టిన విరాట్ కోహ్లీ.. అప్పటి నుంచి ఆ జట్టుకే ఆడుతున్నాడు. జట్టు క్షేమం కోసం ముందుండే కోహ్లీ.. ఐపీఎల్ 2022 మెగా వేలం సందర్భంగా తన ప్రైజ్‌ను కూడా తగ్గించుకున్నాడు. ఒకే జట్టు తరఫున అత్యధిక సీజన్లు ఆడిన ఏకైక ప్లేయర్ కూడా విరాట్ కోహ్లీనే కావడం విశేషం. 17 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో మూడు సార్లు ఫైనల్ చేరిన ఆర్‌సీబీ ఒక్కసారి కూడా విజేతగా నిలవలేకపోయింది.

# హైదరాబాద్‌ను మిస్ అవుతున్నా : వార్నర్

'చార్ సౌ సాల్ కా షహర్'గా పిలుచుకునే హైదరాబాద్ అంటే అభిమానం ఎవరికి ఉండదు. ఒక్కసారి ఈ నగరంతో కనెక్ట్ అయ్యామంటే జీవితాంతం ఆ జ్ఞాపకాలు వెంటాడుతూనే ఉంటాయి. హైదరాబాదీ ప్రజల ప్రేమాభిమానాలకు దాసోహమైన మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ సైతం భాగ్యనగరాన్ని చాలా మిస్ అవుతున్నానని తెలిపాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు గతంలో సారథిగా వ్యవహరించిన అతడిని ఆరెంజ్ ఆర్మీ ఫ్యాన్స్ 'వార్నర్ భాయ్' అని పిలుచుకుంటారు. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్ వేదికగా అతడు.. హైదరాబాద్ ఐకాన్ అయిన చార్మినార్ ఫొటోను షేర్ చేస్తూ 'నాకు అత్యంత ఇష్టమైన ప్రదేశాన్ని మిస్ అవుతున్నా' అని రాసుకొచ్చాడు.




Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657